


# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 159, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, ఆదివారం - 14- జూలై - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



### డొనాల్డ్ ట్రంప్ ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలపై ఆంక్షలు ఎత్తివేసిన మెటా

2021లో క్యాపిటల్ బిల్డింగ్ పై ట్రంప్ అనుచరుల దాడి



### తిరుమల క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

వరుసగా రెండ్రోజులు సెలవులు తిరుమల కొండకు భారీగా తరలి వస్తున్న భక్తులు



### ఇండియా జనాభా ఎంతో తెలుసా..చైనాను దాటేశామా?

ఢిల్లీ: భారత దేశం చాలా గొప్పది. మన భారత దేశంలో అనేక రకాల మతాలు, కులాలకు చెందిన వారుంటారు. అలాగే.. ఇతర దేశాల నుంచి వచ్చి కూడా మన భారత దేశంలో స్థిరపడతారు. అనేక రంగాల్లో

# ఇండియా కూటమి హవా

- 13 ఉపఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి,
- రెండుచోట్ల ఎన్డీయే గెలుపు
- బీహార్‌లోని రూపాలిలో స్వతంత్ర అభ్యర్థి విజయం
- తమిళనాడులో డీఎంకే, బెంగాల్‌లో తృణమూల్ అభ్యర్థుల గెలుపు
- మధ్యప్రదేశ్‌లో బీజేపీ విజయం
- జలంధర్ వెస్ట్‌లో ఆప్ గెలుపు.. మిగతా చోట్ల ఇండియా కూటమి హవా
- ఏడు రాష్ట్రాల్లోని 13 స్థానాలకు ఈ నెల 10న ఉప ఎన్నికలు
- పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు స్థానాల్లోనూ టీఎంసీ హవా
- హిమాచల్ ప్రదేశ్‌లో అనూహ్యంగా లీడ్‌లోకి దూసుకొచ్చిన కాంగ్రెస్



వివరాలు 2లో..

ఢిల్లీ: ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 10న జరిగిన ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలు కాగా, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తొలి విజయాన్ని నమోదు చేసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి లిట్మస్ టెస్ట్‌లా మారాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ మార్కు అందుకోలేకపోయిన బీజేపీ, మెజార్టీ మార్కుకు చేరువగా వచ్చిన కాంగ్రెస్ కూటమి ఈ ఎన్నికలను సవాలుగా తీసుకున్నాయి. పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, పంజాబ్,




బీహార్‌లలో ఈ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్దా, రాణాఘాట్, మణిక్తల, రాయ్‌గంజ్‌లోని నాలుగు స్థానాల్లోనూ అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆధిక్యంలో కొనసాగుతోంది. ఉత్తరాఖండ్‌లోని మంగ్లావుర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఖాజీ నిజాముద్దన్ తన సమీప బీఎస్పీ అభ్యర్థి ఉబేదర్ రెహ్మాన్‌పై 12,540 ఓట్ల ఆధిక్యంతో కొనసాగుతున్నారు. బద్రీనాథ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి లఖ్‌పత్ సింగ్ బుటోలా లీడ్‌లో ఉన్నారు.

### తల్లికి వందనం పథకంపై టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం



భారతి గారు అన్నారంటే అది డిఫరెంట్ మ్యాటర్

నిమ్మల వీడియోపై వైసీపీ నేతల సెటైర్లు

వైఎస్ భారతి వీడియోను తెరపైకి తెచ్చి కౌంటర్ ఇచ్చిన టీడీపీ నేతలు

ప్రెస్ మీట్ పెట్టి స్పందించిన అంబటి రాంబాబు

### ‘కేంద్ర సర్కార్ నిర్ణయంలో ఆశ్చర్యం లేదు’..



- రాజ్యాంగ హత్యాదినంపై ప్రియాంక గాంధీ
- రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీ లేదు
- కేంద్రంలోని మోదీ సర్కార్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది
- ఆ తప్పులే చేస్తే.. మనం అధికారంలోకి వచ్చి ఏం ప్రయోజనం

### నెల రోజుల్లో ఎన్డీయేకు

# మరో ఝలక్




ఉపఎన్నికల్లో ఇండియా కూటమి స్వీప్..!

10న జరిగిన ఉపఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటుకుంది

ఢిల్లీ: ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ సీట్లకు ఈ నెల 10న జరిగిన ఉపఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సాధారణ మెజార్టీని దూరం చేసి మిత్రపక్షాలపై ఆధారపడేలా చేసిన ఇండియా కూటమి..

### వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో

# జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం

- ఫీజురీయింబర్స్‌మెంట్స్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్
- ప్రతి విషయంలో ప్రభుత్వ విధానం కీలకమని వెల్లడి
- కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు తప్పనిసరిగా ఉండాలన్న సీఎం
- గత సీఎంల వల్ల ఐటీ, ఫార్మా రంగాల్లో మనం ముందున్నామన్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్: తొలిసారి ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలకు సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జేఎన్టీయూ పరిధిలో కళాశాలల నిర్వాహకులకు ప్రభుత్వ విధానం తెలియాలన్నారు. ప్రభుత్వ విధానాలు అందరికీ తెలిసేలా ప్రస్తుత

### కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్లే పిల్లలు పక్కదారి పడుతున్నారు



- విద్యార్థులకు మంచి చెడులు చెప్పాల్సిన బాధ్యత మన పైనే ఉందన్న సీఎం
- విద్యార్థులందరూ మన పిల్లలు అనేలా అందరూ చూసుకోవాలని సూచన
- డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అవుతోందని ఆవేదన

# ఎవరైనా నా కాళ్లు మొక్కితే నేను కూడా వారి కాళ్లు మొక్కుతా

- నా కాళ్లకు నమస్కరించవద్దు...
- పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు వినతుల వెల్లువ
- ప్రతి శనివారం మంగళగిరిలోని టీడీపీ ఆఫీసుకు చంద్రబాబు
- అందరితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి
- తన కాళ్లకు దండం పెట్టే సంస్కృతి వద్దని ప్రజలకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- తల్లిదండ్రులు, గురువు, భగవంతుడికి మాత్రమే కాళ్లకు మొక్కాలి



అమరావతి: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో వందల మంది నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వినతులు స్వీకరించారు. ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళుతున్న ముఖ్యమంత్రి... శనివారం ఉదయం కూడా మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ కు వెళ్లారు.

### ఆ ముక్క పట్టుకుని నేను రాష్ట్రమంతా తిరగలేదా?



ఇంట్లో ఇద్దరు పిల్లలకు అమ్మ ఒడి ఇస్తామని నాడు జగన్ చెప్పలేదా?

మూడు పార్టీల మధ్య మాటల దాడికి కారణమవుతున్న తల్లికి వందనం

కుటుంబ సభ్యులపై కోపంతో షర్మిల సీఎం చంద్రబాబుకు సపోర్ట్ చేస్తోందన్న అంబటి

పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందంటూ షర్మిల ఫైర్

## డొనాల్డ్ ట్రంప్ ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలపై ఆంక్షలు ఎత్తివేసిన మెటా

అమెరికా: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలపై గతంలో విధించిన ఆంక్షలను మెటా తాజాగా ఎత్తివేసింది. ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ల మాతృసంస్థ మెటా ఇవాళ ఓ ప్రకటన చేసింది. రాజకీయ నేతల భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అనుమతించడం తమ బాధ్యత అని మెటా స్పష్టం చేసింది. అదే సమయంలో అభ్యర్థుల ఆలోచనలను, మాటలను అమెరికా ప్రజలు కూడా వినాలని సూచించింది. ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి సోషల్ మీడియా ఖాతాలను వినియోగించుకోవాలని పేర్కొంది. 2021లో క్యాపిటల్ బిల్డింగ్ పై ట్రంప్ అనుచరుల దాడి ఘటనతో ఆయన ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ ఖాతాలను మెటా నిలిపివేయడం తెలిసిందే. ఇదే రీతిలో ఎక్స్ (ట్విట్టర్) కూడా గతంలో ట్రంప్ ఖాతాపై నిషేధం విధించి, ఆ తర్వాత ఎత్తివేసింది. అయినప్పటికీ ట్రంప్ తన ఎక్స్ ఖాతాను ఉపయోగించడంలేదు.

## తిరుమల క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుపతి: వరుసగా రెండ్రోజులు సెలవులు రావడంతో తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. నేడు రెండో శనివారం కాగా, రేపు ఆదివారం కావడంతో తిరుమల కొండకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. సర్వదర్శనం టోకెన్లు లేకుండా క్యూలైన్లలోకి వస్తున్న భక్తులకు శ్రీవారి దర్శనానికి 30 గంటల వరకు సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్ మెంట్లు, నారాయణగిరి షెడ్లు అన్నీ నిండిపోయి, కృష్ణతేజ అతిథి గృహం వరకు భక్తుల క్యూలైన్లు కొనసాగుతున్నాయి. నిన్న (శుక్రవారం) స్వామివారిని 63,493 మంది భక్తులు దర్శించుకున్నారు. 31,676 మంది తలనీలాల మొక్కు సమర్పించుకున్నారు. నిన్న ఒక్కరోజే స్వామివారికి హుండీ ద్వారా రూ.4.69 కోట్ల ఆదాయం లభించింది.

### ఇండియా జనాభా ఎంతో తెలుసా..

## చైనాను దాటేశామా?

ఢిల్లీ: భారత దేశం చాలా గొప్పది. మన భారత దేశంలో అనేక రకాల మతాలు, కులాలకు చెందిన వారుంటారు. అలాగే.. ఇతర దేశాల నుంచి వచ్చి కూడా మన భారత దేశంలో స్థిరపడతారు. అనేక రంగాల్లో పని చేసే వారు మన ఇండియాలో ఉన్నారు. అయితే.. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. జనాభాలో మన ఇండియా కూడా టాప్ 10 లో ఉంటుంది. చైనా ఎక్కువ జనాభాతో ఉంటుంది. అయితే.. చైనా కంటే ఎక్కువ జనాభా ఇండియాలో ఉన్నారని ఐక్య రాజ్య సమితి తాజాగా ప్రకటించింది. కానీ అది వాస్తవం కాదు. మరి ప్రస్తుతం భారతదేశ జనాభా ఎంతో తెలుసా....? అక్షరాల 144 కోట్లు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ నివేదిక ఈ విషయాన్ని తాజాగా వెల్లడించింది. అంటే చైనా కంటే మన జనాభా తక్కువే అన్న మాట. చైనా జనాభా 145 కోట్లకు పైగా ఉండే ఛాన్స్ ఉంది. ఇక ఇండియాలో 0 నుండి 14 సంవత్సరాల వయస్సులో ఉన్నవారు 20 శాతం మంది ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2021లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం మన దేశ జనాభా సుమారు 121 కోట్లు. స్త్రీలు ప్రసవ సమయంలో శిశు మరణాల సంఖ్య బాగా తగ్గినట్టు నివేదికలో వెల్లడైంది. దేశ జనాభాలో 10 నుండి 19 ఏళ్ల మధ్యనున్నవారు 17 శాతం మంది ఉండగా.... 10 నుండి 24 ఏళ్ల మధ్య ఉన్నవారు 68 శాతం మంది ఉన్నారు. ఇక సీనియర్ సిటిజన్లు 70% మంది ఉన్నారు. సాధారణంగా పురుషుల ఆయుర్దాయం 71 సంవత్సరాలు కాగా.... స్త్రీల ఆయుర్దాయం 74 సంవత్సరాలుగా ఉందని (యుఎన్ఎఫ్పిఎ) తెలిపింది. 2006-2023 మధ్యకాలంలో భారతదేశంలో బాల్య వివాహాలు 28% శాతమని నివేదికలో వెల్లడించారు. పిఎల్ఓఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 640 జిల్లాల్లో ప్రసవానంతర మరణాల నిష్పత్తి లక్ష జననాలకు 70 కంటే తక్కువగా నమోదు అయ్యింది. 114 జిల్లాల్లో మాత్రం ఈ నిష్పత్తి 210 కంటే ఎక్కువగా ఉంది. దాదాపు సగం మంది దళిత మహిళలకు ప్రసవానంతరం సంరక్షణ అందటం లేదని నివేదికలో వెల్లడించారు. ఇక ఏపీలో 6 కోట్ల వరకు జనాభా ఉందని ఈ లెక్కలలో తేలింది.

## 'కేంద్ర సర్కార్ నిర్ణయంలో ఆశ్చర్యం లేదు'..

దిల్లీ: దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన జూన్ 25ను ఇకపై ఏటా 'రాజ్యాంగ హత్యాదినం' (సంవిధాన్ హత్యాదివస్)గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. మోదీ సర్కార్ తీసుకున్న చర్యలపై మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీ లేదని అని విమర్శలు గుప్పించారు. "దేశంలోని గొప్ప వ్యక్తులు కలిసికట్టుగా స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. కానీ, కేంద్రంలోని మోదీ సర్కార్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది. దాన్ని రద్దు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు 'సంవిధాన్ హత్యాదివస్' ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారు మాత్రమే పరిరక్షణ కోసం పోరాడుతున్నారు" అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

ఆ తప్పులే చేస్తే.. మనం అధికారంలోకి వచ్చి ఏం ప్రయోజనం: గడ్కరీ

నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారని.. కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారని ఎన్డీయే సర్కార్ గుర్తు చేసింది. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను 'సంవిధాన్ హత్యాదివస్'గా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇదంతా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న మరో కపట ప్రచార ఎత్తుగడ అని పేర్కొంది.

### కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్లే

## పిల్లలు పక్కదారి పడుతున్నారు

హైదరాబాద్: కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్లే చాలామంది పిల్లలు పక్కదారి పడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు మంచి చెడులు చెప్పాల్సిన బాధ్యత మన పైనే ఉందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, మహిళల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్యార్థులందరూ మన పిల్లలు అనేలా అందరూ చూసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచించారు. వారికి మంచి చెడులు చెప్పాలన్నారు.

## నెల రోజుల్లో ఎన్డీయేకు మరో ఝలక్

మొదటి పేజి తరువాయి

తాజాగా జరిగిన ఉపఎన్నికల్లో మరోసారి దుమ్ము రేపింది. ఈసారి సార్వత్రిక ఎన్నికలను మించి సీట్లు సాధించి బీజేపీని, ఎన్డీయేను వెనక్కి నెట్టేసింది. ఎన్డీయే వర్సెస్ ఇండియా బ్లాక్ గా మారిన పోరులో అసాధారణ విజయాలు అందుకుంది. పశ్చిమ బెంగాల్లో నాలుగు, హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు, ఉత్తరాఖండ్‌లో రెండు, బీహార్, పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడులో ఒక్కొక్క సీట్లకు ఈ నెల 10న ఉపఎన్నికలు జరిగాయి. వీటి ఓట్ల లెక్కింపు జరిగింది. ఫలితాల్లో బెంగాల్లోని రాయ్‌గంజ్, రణఘాట్ దక్షిణ్, బాగ్దా, మానిక్తలా అసెంబ్లీ సీట్లలో ఉపఎన్నికలను అధికార టీఎంసీ గెల్చుకుని క్లీన్ స్వీప్ చేసింది. అలాగే హిమాచల్ ప్రదేశ్ లోని మూడు సీట్లలో రెండు గెల్చుకోవడం ద్వారా అధికార కాంగ్రెస్ సత్తా చాటింది. ఇందులో సీఎం భార్య కమలేష్ ఠాకూర్ పోటీ చేసిన డెహ్రా సహా మరో సీటు కూడా ఉంది. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగళౌర్ లో కాంగ్రెస్ గెలుపొందింది. పంజాబ్ లోని జలంధర్ సీటును ఆప్ గెల్చుకుంది. తమిళనాడులోని విక్రవండీ సీటులో డీఎంకే ఘన విజయం సాధించింది. ఎన్డీయే కూటమిలో భాగమైన బీజేపీ మధ్యప్రదేశ్ లోని అమర్వారా సీటులో గెలిచింది. అలాగే హిమాచల్ ప్రదేశ్ లోని హమీర్ పూర్ సీటును బీజేపీ గెల్చుకుంది. మరోవైపు బీహార్ లోని రూపౌలీ సీటును జేడీయూ గెల్చుకుంది. దీంతో ఇండియా కూటమికి 10 సీట్లు, ఎన్డీయేకు 3 సీట్లు దక్కినట్లయింది.

## కేజ్రీవాల్ కోమాలోకి వెళ్లే ప్రమాదం!



ఢిల్లీ: మద్యం పాలసీ కేసులో తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 8.5 కిలోలు తగ్గారని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ ఆరోపించారు. జైల్లో ఉండగా ఐదుసార్లు ఆయన బ్లడ్ షుగర్ పడిపోయిందన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కేజ్రీవాల్‌ను జైల్లో తీవ్రంగా వేధించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఇది అత్యంత ఆందోళనకరమైన అంశమన్నారు. మద్యం పాలసీ కేసులో ఈడీ, సీబీఐ అరెస్ట్ చేసిన తర్వాత ఏప్రిల్ 1 నుండి కేజ్రీవాల్ తీహార్ జైలులో ఉన్నారు. మార్చి 21న ఈడీ అరెస్ట్ చేసిన సమయంలో కేజ్రీవాల్ 70 కిలోలు ఉన్నారని, ఇప్పుడు ఆయన బరువు 61.5 కిలోలకు తగ్గిందని తెలిపారు. జైల్లో కేజ్రీవాల్‌ను చిత్రహింసలు పెట్టడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. ఆయన జీవితంతో ఆడుకోవడమే మోదీ లక్ష్యమని మండిపడ్డారు. కేజ్రీవాల్‌కు ఎలాంటి పరీక్షలు నిర్వహించకపోవడంతో బరువు ఎందుకు తగ్గుతున్నారో కారణం తెలియడం లేదన్నారు. బరువు తగ్గడం తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బరువు తగ్గడమే కాకుండా ఐదుసార్లు షుగర్ లెవల్స్ పడిపోయాయన్నారు. ప్రతిసారి షుగర్ లెవల్స్ పడిపోతున్నాయంటే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు.

# వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం

మొదటి పేజి తరువాయి



కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విషయంలో ప్రభుత్వ విధానం చాలా కీలకమన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్సుమెంట్స్ బకాయిలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కళాశాలలు నిరుద్యోగులను తయారు చేసే పరిశ్రమలుగా ఉండకూడదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందుతున్న దేశానికి సివిల్ ఇంజినీరింగ్ అత్యంత అవసరం అన్నారు. కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఈ కోర్సులు లేకుంటే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని హెచ్చరించారు. గత ముఖ్యమంత్రుల నిర్ణయాల కారణంగా మనం ఫార్మా, ఐటీ రంగాల్లో ముందున్నామని ప్రశంసించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కోర్సులు ఉండాలన్నారు. ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచాన్ని నడిపించబోతోందన్నారు. రాష్ట్రంలోని కళాశాలల్లో ఏఐకి సంబంధించిన కోర్సులను కూడా ప్రవేశపెట్టాలన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుందని హామీ ఇచ్చారు. త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి అటానమస్ హోదా ఇస్తామన్నారు. పక్క రాష్ట్రాలతో పోటీపడే విధంగా కాకుండా ప్రపంచంతో పోటీ పడేవిధంగా మనం తయారు కావాలని సూచించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.

దేశంలో, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలన్నీ ఇంజనీర్లు సృషించినవే. మానవనిర్మిత అద్భుతాలన్నీ ఇంజనీర్లు ఆవిష్కరించినవే. ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మారకూడదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్తును నిర్మించేలా ఉండాలి. అందుకు కావాల్సిన సాయాన్ని అందించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాదు.. దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ సంస్థలు ఉండాలి. ఇంజనీరింగ్‌లో కేవలం కంప్యూటర్ సైన్స్‌పైనే కాదు.. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలి. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా భాగస్వామ్యంతో రూ.2400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలు మారుస్తోంది. ఫార్మా, ఐటీ తరువాత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతోంది. యువత కోసం త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. మా ప్రభుత్వానికి భేషజాలు లేవు. నిరుద్యోగులకు మేలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి. నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళుతోంది. పదేళ్లు ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కొట్లాడింది. కానీ.. ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేస్తున్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను తీసుకురాబోతున్నాం. యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తాం. విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు అనేదే మా ప్రభుత్వ విధానం. మేం అధికారంలోకి వచ్చిన మొదటి 30 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆర్థిక భారం, ఇతర సమస్యలు ఉన్నా.. ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



# ఎవరైనా నా కాళ్లు మొక్కితే నేను కూడా వారి కాళ్లు మొక్కుతా

మొదటి పేజి తరువాయి

తన కోసం వేచి ఉన్న ప్రజలు, కార్యకర్తలను కలిశారు. ముందుగా గేటు వద్ద రాజమండ్రి నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. అనంతరం మీడియా రూంలో ప్రజలను, కార్యకర్తలను, వివిధ సమస్యలపై వచ్చిన వారిని కలిశారు. ఆరోగ్య సమస్యలు, భూ వివాదాలు, వ్యక్తి గత సమస్యలపై ప్రజలు సీఎంకు విన్నవించారు. ఇక కార్యకర్తలు, నేతలు నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబును కోరారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వంలో పనిచేసిన బీమా మిత్రలు తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. విజయవాడకు చెందిన షేక్ ఆసిన్, మహ్మద్ ఇంతియాజ్ రాజధాని అమరావతి కోసం రూ.1 లక్ష విరాళంగా ఇచ్చారు. ఫర్నిచర్ షాపు నడుపుతున్న వీరు లక్ష విరాళం ఇవ్వడాన్ని చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఆశోక్ బాబు సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

### పాపకు రూ.16 కోట్ల ఇంజక్షన్ కోసం సాయం కోరిన బాధితులు

గుంటూరుకు చెందిన వెచ్చా ప్రీతమ్ దంపతులు తమ పాప హితైషిని తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఏడాది వయసున్న హితైషి తీవ్రమైన వ్యాధితో బాధపడుతోంది. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న పాపకు చికిత్స కోసం వారు ముఖ్యమంత్రిని కలిశారు. పాపకు ఉన్న జబ్బు నయం కావాలి అంటే [illegible] అనే ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని ధర రూ.16 కోట్లు కావడంతో తల్లిదండ్రులు సాయం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఫండ్ రైజింగ్ కార్యక్రమం కూడా చేపట్టారు. మరో నెల రోజుల్లో ఈ చికిత్స అందించాల్సి ఉందని తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై వెంటనే పరిశీలన జరుపుతామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. అనంతరం తన ఛాంబర్ లో నేతలను చంద్రబాబు కలిశారు. పార్టీ అంశాలపై వారితో చర్చించారు.

### నా కాళ్లకు నమస్కరించవద్దు... ఎవరైనా నా కాళ్లు మొక్కితే నేను కూడా వారి కాళ్లు మొక్కుతా

ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నేతలు తన కాళ్లకు నమస్కరించే పని చేయవద్దని సీఎం నారా చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజలతో కాళ్లకు నమస్కారం పెట్టించుకునే సంస్కృతి మంచిది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంత వారిస్తున్నా ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తన కాళ్లకు నమస్కారాలు చేస్తున్నారని... ఇలా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు, గురువులు, దేవుడికి మాత్రమే కాళ్లకు మొక్కాలని.... నాయకులకు కాదని చంద్రబాబు అన్నారు. రాజకీయ నాయకులు కూడా ఈ సంస్కృతికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ప్రజలకు నేరుగా ఆయన విజ్ఞప్తి చేశారు. వారించినా కూడా వినకుండా ఎవరైనా తన కాళ్లకు మొక్కితే.....తిరిగి తాను కూడా వాళ్ల కాళ్లకు మొక్కుతానని చంద్రబాబు స్పష్టం చేశారు. తన సూచనను, విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకుని సహకరించాలని సీఎం కోరారు. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో నడుచుకోవాలని... కాళ్లకు మొక్కే సంస్కృతి మంచి విధానం కాదని అభిప్రాయపడ్డారు. ఇవాళ్టి నుంచి ఈ విధానానికి స్వస్తి పలుకుదామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# ఆ ముక్క పట్టుకుని నేను రాష్ట్రమంతా తిరగలేదా?



అమరావతి: తల్లికి వందనం పథకం ఇప్పుడు మూడు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలకు కారణమవుతోంది. వదిన (భారతి)పై కోపమో, అన్న (జగన్)పై కోపమో... కుటుంబ కారణాల వల్లో షర్మిల ఇప్పుడు చంద్రబాబును సపోర్ట్ చేసే కార్యక్రమం షురూ చేశారని వైసీపీ నేత అంబటి రాంబాబు వ్యాఖ్యానించడం తెలిసిందే. దీనిపై ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందనే సామెతలా వైసీపీ నేతల తీరు ఉందని విమర్శించారు. సాక్షి పత్రికలో తల్లికి వందనం ఉత్తర్వులపై వచ్చిన వార్తకు చంద్రబాబు సమాధానం చెప్పాలని మేం అడిగితే... బాబుకు కాంగ్రెస్ తోక పార్టీ అని ముడిపెట్టడం మీ అవగాహనా రాహిత్యానికి నిదర్శనం అని షర్మిల ధ్వజమెత్తారు. "వైసీపీ నేతలకు కళ్లుండి, వినడానికి చెవులుండి, విజ్ఞత కలిగిన వాళ్లే అయితే... మేం చెప్పింది ఏమిటో ఒకటికి పది సార్లు వినాలి. తల్లికి వందనం జీవో.29లో క్లారిటీ లేదని, సాక్షి కథనంపై వివరణ ఇవ్వాలని మేం చంద్రబాబును కోరాం. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ పథకం వర్తింపజేయాలని మేం డిమాండ్ చేశాం. మరి, ఇది కూటమి ప్రభుత్వానికి కొమ్ముకాసినట్టు ఎలా అవుతుంది? మేం నిన్న ప్రెస్ మీట్ పెట్టి నిలదీశాం కాబట్టే... 24 గంటలు గడవకముందే ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇచ్చింది. రాష్ట్రంలోని తల్లుల మేం నిలబడితే కాంగ్రెస్ చంద్రబాబుకు తోకపార్టీ ఎలా అవుతుంది? వైసీపీ నేతలకు బహిరంగ సవాల్. 2019 ఎన్నికల కంటే ముందు జగన్ ఇంట్లో ఇద్దరు బిడ్డలకు ఇస్తామని చెప్పలేదా? ఆ ముక్క పట్టుకుని నేను రాష్ట్రమంతా ప్రచారం చేయలేదా? ఆ మాట మీరు నిలబెట్టుకున్నారా, లేక, నిలువునా మోసం చేశారా అంటే... అది ప్రజలు మీకిచ్చిన తీర్పే చెబుతోంది. ఆ రోజు నాతో ఊరూరా, ప్రతిచోట ప్రచారం చేయించడం నిజం కాదా? నేను వైసీపీ కోసం బై బై బాబు క్యాంపెయిన్ చేయడం ఎంత నిజమో, అమ్మ ఒడి కింద ఇద్దరు బిడ్డలకు రూ.15 వేలు చొప్పున ప్రతి తల్లికి ఇస్తాం అని ప్రచారం చేయడం కూడా అంతే నిజం. మరి ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇచ్చే ఉద్దేశం లేకపోతే నాతో ఎందుకలా ప్రచారం చేయించారు? మీరు కూడా ఎందుకు ప్రచారం చేశారు? సంపూర్ణ మద్య నిషేధం చేస్తామని, జలయజ్ఞం పూర్తిచేస్తామని, ప్రత్యేకహోదా సాధిస్తాం అని ఎందుకు ప్రచారం చేయించారు? మీరు కూడా అదే విధంగా ఎందుకు ప్రచారం చేశారు? దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా?" అంటూ షర్మిల వైసీపీ నేతలపై ధ్వజమెత్తారు.

# 13 ఉపఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల ఎన్డీయే గెలుపు

మొదటి పేజి తరువాయి

పంజాబ్‌లోని జలంధర్ వెస్ట్‌లో ఆప్ అభ్యర్థి మొహిందర్ భగత్ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 37,325 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడి నుంచి విజయం సాధించిన ఆప్ ఎమ్మెల్యే శీతల్ అంగురల్ బీజేపీలో చేరడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. తమిళనాడులోని విక్రవంది అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ లీడింగ్‌లో ఉన్నారు. బీహార్‌లో జేడీయూ అభ్యర్థి కళాధర్ ప్రసాద్ మండల్ 2,433 ఓట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లా అమర్వారా నియోజకవర్గంలో బీజేపీ ఆధిక్యంలో ఉండగా, హిమాచల్ ప్రదేశ్‌లో తొలుత వెనకబడిన కాంగ్రెస్ పుంజుకుని ఆధిక్యంలోకి దూసుకొచ్చింది. ఇక్కడ మూడు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. డేహ్రాలో తొలుత వెనకబడిన సీఎం సుఖ్విందర్ సుఖు భార్య కమలేశ్ ఠాకూర్ 16,984 ఓట్లతో ఆధిక్యంలోకి దూసుకొచ్చారు.




13 ఉపఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల ఎన్డీయే గెలుపు

దేశవ్యాప్తంగా జరిగిన 13 ఉప ఎన్నికల్లో 10 చోట్ల ఇండియా కూటమి, రెండుచోట్ల బీజేపీ, ఒకచోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు.

దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. ఉపఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి, మూడు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. పశ్చిమ బెంగాల్‌లో 4, హిమాచల్ ప్రదేశ్‌లో 3, ఉత్తరాఖండ్‌లో 2, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఒక్కో స్థానంలో ఉప ఎన్నికలు జరిగాయి. హిమాచల్ ప్రదేశ్‌లో డెహ్రా, నలాగఢ్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, హమీర్‌పూర్ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. మధ్యప్రదేశ్‌లోని అమరవారా నుంచి బీజేపీ అభ్యర్థి కమలేశ్ ప్రతాప్ షా విజయం సాధించారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులోని విక్రవాండిలో డీఎంకే, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్లౌర్‌లలో కాంగ్రెస్ గెలుపొందింది. పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రణఘాట్ సౌత్, బాగ్దా, మానిక్తలాలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. బీహార్‌లోని రూపాలిలో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు.

# తల్లికి వందనం పథకంపై టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం




అమరావతి: తల్లికి వందనం పథకంపై టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా, వైసీపీ నేత అంబటి రాంబాబు కూడా కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. టీడీపీ నేతలు వైఎస్ భారతి వీడియోను తెరపైకి తీసుకురావడం పట్ల ఆయన స్పందించారు. ఎన్నికలకు ముందు వాగ్దానాలు ఇచ్చి, ఆ తర్వాత విస్మరించే వ్యక్తి పేరు నారా చంద్రబాబునాయుడు అని వ్యాఖ్యానించారు. మేనిఫెస్టో అమలు చేయకుండా, అధికారంలోకి వచ్చిన ఈ నెలా పది రోజుల్లోనే ఎన్ని దుర్మార్గాలు చేశారో చూడండి అంటూ ధ్వజమెత్తారు. తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం ఇంకా అమలు చేయకపోవడం ఏంటని నిలదీశారు. మేనిఫెస్టోలో ఉన్న పథకాన్ని అమలు చేయకుండా, రెడ్ బుక్ పేరుతో తమపైనే ప్రతీకార దాడులు చేస్తున్నారంటూ మండిపడ్డారు. "మా పార్టీ ఆఫీసులు కూల్చేస్తారా... తప్పుడు జీవోలు ఇచ్చి మా ప్రజలను ఇబ్బంది పెడతారా... మాజీ ముఖ్యమంత్రి మీద కేసులు పెడతారా... ఎమ్మెల్యేలపైనా, మాజీ ఎమ్మెల్యేలపైనా కేసులు పెట్టి లోపల తోస్తారా... కక్ష సాధింపులు ఉండవు అన్నారు... ఆ మాటకు అర్థం ఇదేనా...? కక్ష సాధింపులు తప్ప ఈ ప్రభుత్వానికి రెండో పనే లేదు. ఈ వాస్తవాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఈ దుర్మార్గమైన పాలన ఇంకా నాలుగు సంవత్సరాలు 11 మాసాలు భరించాలా? అనే పశ్చాత్తాపం ప్రజల్లో ప్రారంభమయ్యే విధంగా నారా లోకేశ్ గారు చక్కని ప్రోగ్రామ్ నిర్ణయించారు... చాలా సంతోషం! రెడ్ బుక్ అమలు చేయాలి అంటూ గుంటూరులో పెద్ద పెద్ద పోస్టర్లు కనిపిస్తున్నాయి. కేసులు పెట్టి మమ్మల్నందరినీ లోపల వేయండి చూస్తాం. పడ్డవాడు ఎప్పుడూ చెడ్డవాడు కాదు. తల్లికి వందనంపై మేం అడుగుతున్నామని భారతి గారి వీడియో తీసుకువచ్చారు. ఆ వీడియో పక్కనబెట్టి... 2019 ఎన్నికల్లో మా మేనిఫెస్టో ఏంటో చూడండి, ఈ ఎన్నికల్లో కూటమి మేనిఫెస్టో ఒక్కసారి చూడండి. కూటమి మేనిఫెస్టోలో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అన్నారు... మా మేనిఫెస్టోలో ప్రతి తల్లికి రూ.15 వేలు అని అన్నాం.... తేడా ఉంది కదా. భారతి గారు అన్నారు, రాంబాబు గారు అన్నారు అంటే అది డిఫరెంట్ మ్యాటర్. ఇదే విషయం షర్మిల గారు కూడా అన్నారు... ఆమెది వేరే విషయం. వదిన గారి మీద ఉన్న కోపమో, అన్న గారి మీద ఉన్న కోపమో... కుటుంబ కారణాల వల్ల ఆమె చంద్రబాబును సపోర్ట్ చేసే కార్యక్రమం చేస్తున్నారు" అంటూ అంబటి రాంబాబు విమర్శనాస్త్రాలు సంధించారు.

## శ్రీ చైతన్య అధినేత డా. బి.ఎస్.రావుకు ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (గౌతమ్ న్యూస్): కనీవినీ ఎరుగని రికార్డ్ ఫలితాలు సృష్టించి తెలుగు ప్రజల కీర్తిని జాతీయ స్థాయిలో రెపరెపలాడించిన మహోన్నత వ్యక్తి బి.ఎస్.రావు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డా. బి.ఎస్.రావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ జిల్లా నందిగామ శ్రీ




చైతన్య టెక్నో పాఠశాలలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు కొనియాడుతూ నందిగామ శ్రీ చైతన్య ఈ టెక్నో పాఠశాలలో ప్రిన్సిపల్ రమేష్ పవారి, ఎజీఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులతో కలసి బి.ఎస్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ విద్యారంగం చరిత్రలోనే కనీవినీ ఎరుగని రికార్డ్ ఫలితాలు సృష్టించి తెలుగు ప్రజల కీర్తిని జాతీయ స్థాయిలో రెపరెపలాడించిన మహోన్నత వ్యక్తి బి.ఎస్.రావుని ప్రశంసించారు. తొలి నుంచే శిక్షణలో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టి, సంచలనాత్మకమైన ప్రోగ్రామ్‌లు సృష్టించి అద్భుత ఫలితాలలో శ్రీచైతన్య అగ్రస్థానంలో నిలిపిన విద్యా ప్రధాతని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అటు బోర్డు పరీక్షలతో పాటు ఇటు ఒలింపియాడ్‌లోనూ మర్వెవరికీ సాధ్యంకాని ఫలితాలతో చరిత్ర సృష్టించారు. శ్రీచైతన్య స్కూల్స్, కాలేజీలను 21రాష్ట్రాలలో విస్తరించి 900 పైగా బ్రాంచీలతో, 9 లక్షలకుపైగా విద్యార్థులతో, 50వేలకు పైగా అ ధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బందితో ఆసియా ఖండంలోనే అతిపెద్ద విద్యాసంస్థగా నిలిపారన్నారు. అనంతరం గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వృద్ధులు వితంతులు దివ్యాంగుల ఒంటరి మహిళలు దగ్గర నుంచి పెన్షన్లు రికవరీ చేస్తే పోరాటం తప్పదు

### తెలంగాణ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ హెచ్చరిక.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు మీకు వేరే ఆదాయ మార్గాలు వస్తున్నాయని మీకు ఇప్పటివరకు వస్తున్న పెన్షన్ను డబ్బులు మొత్తం తిరిగి చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయడం చాలా హాస్యాస్పదమని నిరుపేద వృద్ధులు వితంతువులు దివ్యాంగులు ఒంటరి మహిళలు ప్రభుత్వం ఇచ్చే ఆసరా పెన్షన్తో బతకలేరని వాళ్లు స్వతహాగా ఆదాయ మార్గాలు ఎంచుకొని కష్టపడి జీవిస్తున్నారని వాళ్లకు వేరే ఆదాయ మార్గాలు వస్తే వాటిని సాకుగా చూపుతూ పెన్షన్లు రద్దు



చేయడం పెన్షన్ రికవరీ చేయడం గతంలో పెన్షన్ డబ్బులు అన్ని రికవరీ చేయడం చాలా అన్యాయం అని పేద నిరుపేద ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వితంతులు వృద్ధులు మహిళలు దివ్యాంగులు ఒంటరి మహిళలు ఎవరు కూడా ఒకరి మీద ఆధారపడకుండా జీవిస్తూ కొడుకులు బిడ్డలు ఉద్యోగాలు ఉన్న చూసే పరిస్థితి లేక అనారోగ్య సమస్యలతో జీవితాన్ని అనుభవిస్తూ కొడుకులు బిడ్డలు ఉన్న చూసే పరిస్థితి లేక దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆఖరికి ప్రభుత్వం పెన్షన్లను కూడా రద్దు చేయడం లేదా రికవరీ చేయడం అన్యాయం అన్నారు ప్రస్తుత ధరల పరిస్థితులలో సామాన్యమైన మానవులు కుటుంబం వెళ్లదీయాలంటే నెలకి ఖచ్చితంగా పదివేల రూపాయలు కావాలని వృద్ధ వయసులో అనేక ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ సరిపోక బిడ్డలు కొడుకులు చూడక ఇటు చావలేక అనారోగ్య సమస్యలతో బతకలేక దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న వృద్ధులు ఒంటరి మహిళలు వితంతువులు దివ్యాంగులపైప్రభుత్వం ఇలా కక్ష సాధింపు చర్యలు చేయడం మంచిది కాదని కోట శివశంకర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా పదవి బాధ్యతల స్వికరణ

### ఎన్.ప్రీతం ను గజమాలతో సత్కరించిన కూసపాటి శ్రీనివాస్ మాదిగ.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నగారి గారి ప్రీతం పదవీ బాధ్యతలు స్వీకరణ 12 జూలై 2024 మధ్యాహ్నం 12.గం.కు 5 వ అంతస్తు డిఎస్ఎస్ భవన్ మాసబ్ ట్యాంక్ హైదరాబాద్ లో జరిగిన ఈకార్యక్రమంలో అన్నిజిల్లాల నుండి పెద్దఎత్తున చర్మకారులు రోడ్‌సైడ్ చెప్పులు కుట్టేవారు, తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘాల జేఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ మాదిగ గారి ఆధ్వర్యంలో తరలి వచ్చి గజామాలతో శాలువాకప్పి సన్మానిచ్చినారు,వారిని చూసి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం సాధారంగా ఆహ్వానించి తన ఉపన్యాసం లో నేను మీ చర్మకారుల సమస్యలు పరిష్కరిస్త మరియు ఎస్సీ కార్పొరేషన్ ఋణలు అందిస్తానని లేదర్ పరిశ్రమ భూములల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి లేదర్ పరిశ్రమలు నిర్మిస్తానని యావత్ సభలో మాట ఇచ్చినారు. ఈ కార్యక్రమం లో చర్మకారుల రాష్ట్ర నాయకులు గాదె కుమారస్వామి, మోతే స్వామి 'మారపేల్లి పోశెట్టి,చంద్రగిరి శ్యామ్,వడ్డమాని నాగరాజు, యాటసురేష్ వనపర్తి సాయి, వనపర్తి వెంకట్,మోతే వంశీ,పాల్గొని కృతజ్ఞతలు తెలియజేసినారు.

## గ్రీన్ ఇండియా మిషన్ ర్యాలీ నిర్వహించిన

### శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని విద్యార్థులు




మానుకోట జిల్లా ప్రతినిధి/(గౌతమ్ న్యూస్): శ్రీచైతన్య విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ ర్యాలీ స్థానిక కృష్ణా కాలనీలో గల శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని విద్యార్థులు స్మార్ట్ లివినింగ్ ప్రోగ్రాంలోని గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో ద్వారా సమాజానికి మరియు ప్రకృతికి సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్క నాటాలని అదేవిధంగా అడవుల శాతం పెంచి ప్రకృతిని సమతుల్యం వివిధ నిదానదాలతో పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అవగాహన పెంచారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి మధు మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యార్థిని విద్యార్థులకు తరగతి బోధనే కాకుండా సమాజం పట్ల అవగాహన మరియు బాధ్యత నేర్పించాలని సంకల్పంతో ప్రతినెల స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో



భాగంగా ఈ జూన్ మాసంలో గ్రీన్ ఇండియా మిషన్ అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి వారి వారి బాధ్యతగా ఒక మొక్క నాటాలని సంకల్పించారు. అదేవిధంగా సమాజంలోని వివిధ రంగాల వారికి అవగాహన కల్పించే విధంగా వివిధ ప్లకార్ట్స్ తో నినాదాలు చేస్తూ పురవీధుల గుండా హోరెత్తించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి చాలా సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థిని విద్యార్థుల యొక్క సర్వతోముఖాభివృద్ధిలో భాగంగా సమాజం పట్ల అవగాహన పెంచుతూ చిన్నప్పటినుండి వారిలో బాధ్యతను ఏర్పరిచి మంచి ప్రయోజకులుగా మార్చడమే శ్రీచైతన్య యాజమాన్యం యొక్క లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలోపాఠశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, జోనల్ కోఆర్డినేటర్ కృష్ణ రావు, పాఠశాల డీన్ నరేష్, లక్ష్మీనారాయణ, పీటి యాకన్న, ఏవో సుధాకర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమని విజయవంతం చేశారు.

# పథకాలు అమోఘ్యం ప్రయోజనం శూన్యం!!

### ప్రజలకు అందని కేంద్ర ప్రభుత్వ పథకాలు!!
### పథకాల పేరుతో నా నిధులు కేటాయింపు!!
### దొడ్డి దారిన నిధులు దుర్వినియోగం!!














నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): కేంద్ర ప్రభుత్వ పథకాలు అమోఘ్యం చెప్పలేని పథకాలు అమలు చేస్తున్నట్లు కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దరిచేరకుండా దుర్వినియోగం అవుతున్నాయని పదేపదే ప్రజలు ఆరోపిస్తున్నారు, ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ మూడవసారి జరిగిన ఎన్నికల్లో ఎలాంటి ఉచిత హామీలు ఇవ్వకపోయినా తిరిగి ప్రజలు నరేంద్ర మోడీకి పట్టం కట్టారు, దీనికి ప్రధాన కారణం దేశ భవిష్యత్తు బిజెపికి సాధ్యమని



ఉగ్రవాదుల నుంచి ఈ దేశానికి పెనుముప్పు వాటిల్లుతుందని దేశ ప్రజలు భావించి ఉగ్రవాదులను తుద ముట్టించి ఈ దేశాన్ని కాపాడుకోవాలని ప్రజల్లో ఒక విశ్వాసం నమ్మకం కసి పెరిగిపోయింది, అంతేకాక ఇటీవల 200 సంవత్సరాల నాటి చరిత్ర గల అయోధ్య రామ మందిర నిర్మాణం భారతీయ జనతా పార్టీ చేసి చూపిస్తూ రాముడు పుట్టిన జన్మస్థలంలో రామ మందిరం కట్టి దేశ ప్రజల విశ్వాసాన్ని ప్రగాఢ సానుభూతిని పొందింది, ఈ దేశంలో జీవిస్తూ ఇతర దేశాల ఉగ్రవాదులకు పరీక్షంగా తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శలు కూడా ఉన్నాయి, అయినా దేశ ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపారు, అంతా బాగున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాల నుంచి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క లబ్ధిదారునికి దరి చేరకుండా పోయాయని తీవ్ర విమర్శలు వస్తున్నాయి, పథకాల పేరు చెప్పి బిజెపి ప్రభుత్వం కాలం గడుపుకుంటూనే ఈ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీ సిపిఐ సిపిఎం పార్టీల నాయకులు పదే పదే విమర్శలు గుప్పిస్తున్నారు, దేవుని పేరు చెప్పి ఓట్లు దండుకొని ఈ దేశాన్ని బిజెపి ప్రభుత్వం నట్టేట ముంచుతుందని పలు రారోపిస్తున్నారు, అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితోనా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఈ రాష్ట్రంలో ఎందుకు అమలు కావడం లేదు అనే



విషయం పైన ఈరోజు కూడా విచారణ చేయకుండా ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా వంతుకు గంతేస్తూ కొర్రీలు పెడుతూ కోతలు విధిస్తూ సంక్షేమ పథకాలను నామం మాత్రం అమలు చేస్తుందని హిమాచల్ కూడా ఉన్నాయి, ఇప్పటివరకు ప్రధానమంత్రి స్వ నిధి పథకం ద్వారా చిన్న వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకం నీరుగారిపోయింది కేవలం పదివేల నుంచి 20వేల వరకు ఆర్థిక సాయం చేస్తూ వీధి వ్యాపారాలను ఆదుకుంటామని ప్రవేశపెట్టిన ఈ పథకం అబ్బాస్ పాలయింది, అంతేకాక స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్, ప్రీ మెట్రిక్స్ స్కాలర్ షిప్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్, మెరిట్ స్కాలర్షిప్, ప్రధానమంత్రి పీఎం కిసాన్ పథకం, ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన, పీఎం ఆవాజ్ యువజన, ఆత్మ నిర్భర్ భారత్, పీఎం ఆదర్శ గ్రామ యోజన, ఉజ్వల పథకం, సురక్ష బీమా, ప్రధానమంత్రి వికసిత్ భారత్ ఒంటి అనేక పథకాలు చెప్పలేని పథకాలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు ప్రకటిస్తూ అందుకు సంబంధించిన నిధులు కూడా బడ్జెట్ సమావేశాల్లో విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అట్టి పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ఏ మూలల కూడా ఏ ఒక్క అమాయక ప్రజలు పేద ప్రజలకు కూడా దరి చేరలేదని విమర్శలు వస్తున్నాయి, వీధి వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన స్వ నిధి పథకం స్వాహా అయిందని




విమర్శలు వస్తున్నాయి, అంతేకాక పీఎం కిసాన్ పథకం కూడా రైతులకు ఏం మాత్రం ఉపయోగపడడం లేదని కేవలం 2000 రూపాయల తోన రైతులకు ఆర్థిక సహాయం చేసినంత మాత్రాన రైతాంగం కేంద్ర ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు, ఇల్లు లేని నిరుపేదలకు పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా మూడు లక్షల రూపాయల రుణం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఎక్కడ కూడా పేద ప్రజలకు గూడు లేక కూడు లేక గోడు వెల్లబుచ్చుకుంటున్నారు, ఈ దేశం స్వచ్ఛ భారత్ దేశంగా టెక్నాలజీ రంగంలో ముందంజలో ఉందని ప్రధానమంత్రి ఊక దుంకుడు ఉపన్యాసాలు ప్రపంచంలోని దేశాలు తిరగడానికి కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేస్తూ ప్రపంచంలోని దేశాలలో విలాసవంతంగా పర్యటిస్తున్న ప్రధానమంత్రి ఈ దేశ ప్రజలకు కనీస అవసరాలు అయినా కూడు గూడు, గుడ్డ, కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శలు వస్తున్నాయి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2019లో ప్రపంచాన్ని చుట్టుముట్టిన కరోనా వైరస్ వల్ల ఈ దేశ ప్రజలను ప్రామాలనుంచి కాపాడినట్లు ఉచితంగా టీకాలు వేసినట్లు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం వంటి విషయాలను దేశ ప్రజలకు పదే పదే వివరించారు, కానీ ప్రధానమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లో ప్రధానమంత్రి ఫోటో తో కూడిన ఫోటోలను కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి దేశంలోని ప్రతి ఇంట్లో కూడా ప్రధానమంత్రి ఫోటో ఉండే విధంగా ముద్రించి పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసం అని విమర్శలు వస్తున్నాయి, రేషన్ షాపుల్లో ప్రధానమంత్రి ఫోటో పెట్టాలని అప్పట్లో కరోనా వైరస్ సమయంలో సన్మా బియ్యం పంపిణీ చేసినంత మాత్రాన ప్రధానమంత్రి ఫోటోను రేషన్ షాపులో ఏ విధంగా పెట్టాలని అదేవిధంగా స్వ నిధి పథకంలో లబ్ధి పొందిన లబ్ధిదారులు కూడా ప్రధానమంత్రి ఫోటోతో కూడిన కేంద్ర ప్రభుత్వం పంపించిన ఫోటోలను లబ్ధికారుల ఇంట్లో పెట్టుకోవాలని డిమాండ్ ఎక్కడ ఉందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, ఇచ్చేది తక్కువ చేసేది ఎక్కువ అనే చందంగా కేంద్ర ప్రభుత్వం ఆర్భాటం , ప్రచారాలకే పరిమితం అవుతుందని ప్రజలు అంటున్నారు, ఈ దేశంలో పేదరికంతోపాటు నిరుద్యోగ సమస్య పెట్రైపోతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వంలోని ఖాళీలను ఎందుకు భర్తీ చేయలేదని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు, దేశంలోని రాష్ట్రాలకు న్యాయంగా



ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా కక్ష సాధింపు పాల్పడుతున్న బిజెపి రాష్ట్రాలపై మొండి వైఖరి అవలంబిస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు విమర్శిస్తున్నారు, బిజెపి పాలిత రాష్ట్రాలలో లక్షల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్న బిజెపి తెలంగాణ రాష్ట్రం పట్ల ఎందుకు చిన్నచూపు చూస్తుందని విమర్శలు వస్తున్నాయి, బిజెపి ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేదని ఈ విషయం పైన ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని అప్పుడే బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పైన ప్రజలకు నమ్మకం కలుగుతుందని ఈ రాష్ట్ర ప్రజలు అంటున్నారు, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం



అనవసరమైన నిధులు ప్రజాధనాన్ని దుర్వినియోగ చేయకుండా ప్రజలకు ఉపయోగ పథకాలను ప్రవేశపెట్టాలని ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు ఏమాత్రం ప్రజలకు ఉపయోగ లేదని ఈ విషయం పైన ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఆలోచిస్తే అసలు విషయం బయట పడుతుందని పలు అంటున్నారు, ప్రతి సంక్షేమ పథకంలో కూడా కండిషన్, కోతలు, షరతులు ఉన్న సంగతి ప్రజలు




గుర్తించారు, అందుకే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నీరుగారి పోతున్నాయి, ఇప్పటికైనా ఆర్భాటం ప్రచారాలను మానుకొని కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఈ రాష్ట్రంలో ప్రతి ఒక్క పేదవాడికి దక్కే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు,

# మాయమైన మహాలక్ష్మి పథకం!!

### మహాలక్ష్మి కోసం మహిళల ఎదురుచూపు!!
### పథకాల అమలు కోసం ప్రభుత్వం కష్టాలు!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో నా అధికారంలోకి వచ్చింది, ప్రజలకు ఆకర్షణీయమైన పథకాలను ప్రవేశపెడుతూ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ తో సహా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బహిరంగ సభలో ప్రజలను తమ తమ ప్రసంగాల ద్వారా తమ వైపు తిప్పుకున్నారు, అంతా బాగున్నప్పటికీ 6 గ్యారెంటీ పథకాలలో ఇప్పటికీ కేవలం



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మాత్రమే కొనసాగుతుంది, 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించిన ఎస్సీ ఎస్టీ బీసీ పేద ప్రజలకు ఉచిత కరెంటు బిల్లు జీరో బిల్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి జీరో బిల్లు అందరికీ అందక కరెంటు బిల్లుల మోత మోగుతుంది, అంతేకాక 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి ఆ పథకం అమలు కాలేదని ప్రజలు విమర్శిస్తున్నారు, రైతు భరోసా పథకంలో కూడా ఎకరాకు 7500 రూపాయల పథకం గత సంవత్సరం యాసంగి సీజన్ లో ఇవ్వవలసిన ప్రభుత్వం మాట తప్పింది తిరిగి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు రైతు భరోసా పథకం పేరుతోనా





కాలయాపన చేస్తూ సమీక్ష సమావేశాలు రైతులు అభిప్రాయ సేకరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది, ఎప్పుడు పూర్తవుతుంది రైతు బరసనిధులు ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందని ప్రయత్నం ఎదురుచూస్తున్నారు, ఇందులో ప్రధానంగా మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు పిల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలకు నెలకు ?2,500 ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని కూడా ఇప్పటికి అమలు చేయలేదని మహిళలు ఎదురుచూస్తున్నారు, ఆరోగ్యశ్రీ పథకంలో కేవలం 5 లక్షల నుంచి 10 లక్షల పెంచింది కానీ ప్రజలకు అత్యవసరమైన పథకాలు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ బిల్లు తోపాటు మహాలక్ష్మి పథకం కింద 2500 రూపాయల తోపాటు రైతు భరోసా కింద రైతులకు ఎకరాకు 7500 రూపాయలను ఎప్పుడు చెల్లిస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు ఉచిత పథకాలను హామీ ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయడానికి నా నా తండాలు పడుతున్నట్టు తెలుస్తుంది, ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం ఖచ్చితంగా చేసి తీరుతుందని ప్రభుత్వం స్పష్టంగా చెబుతుంది, ఇప్పటికే రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా ఉందని స్వయంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రకటించారు, ఇలాంటి అప్పుల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేస్తుందని ఒకవైపు ప్రజలు మరొకవైపు ప్రతిపక్ష పార్టీలు భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి పార్టీల నాయకులు ఎదురుచూస్తున్నారు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో ఈ పథకాలు కొంపముంచే ప్రమాదం ఉందని కూడా విశ్లేషకులు అంటున్నారు, ఇందులో ముఖ్యంగా రైతు భరోసా పథకం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నట్టేట ముంచే ప్రమాదంలో ఉన్నట్లు విశ్లేషకులు అంటున్నారు, ఈ పథకంలో ప్రభుత్వం ఆచితూచి అడుగు ముందుకు వేసినా కూడా రైతుల వ్యతిరేకత వస్తున్నట్లు తెలుస్తుంది, మరోపక్క మహిళకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ఈ పథకాలన్నీ కూడా రాష్ట్రంలో అమలు కావాలని లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం ఎదురీత తప్పదని పలువురు అంటున్నారు, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఎలాంటి హామీలు ఇవ్వకుండా ఎన్నికల్లో పోటీ చేయడం ఓడిపోవడం జరిగింది, కాంగ్రెస్ పార్టీ ఆకర్షణీయమైన పథకాలకు ప్రజలు ఆకర్షితులయ్యారు, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తే 10 సంవత్సరాల వరకు కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని రాజకీయంగా అనుభవరిగిన ఎంతో మంది మేధావులు కవులు కళాకారులు విద్యావేత్తలు అంటున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యతో నిరుద్యోగులు కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో డిసెంబర్ లోపు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రకటన ప్రకారం డిసెంబర్ లోపు 2 లక్షల ఉద్యోగాలు కూడా పట్టించుకోవాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు,



## తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

### డా. పెరుమాండ్ల రామకృష్ణ



హనుమకొండ(గౌతమ్ న్యూస్): హైదరాబాదులోని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాసంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో పాటు జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ ఛైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రజా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి కి డా. రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం తెలంగాణను అప్పులు కుప్పలుగా చేసిందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా పాలనే లక్ష్యంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ఆయనతోనే సాధ్యమని అన్నారు.

## గన్ మిస్ ఫైర్ :అపార్ట్ మెంట్ దూసుకొచ్చిన బుల్లెట్



హైదరాబాద్(గౌతమ్ న్యూస్): తుపాకులు మిస్ ఫైర్ వంటి సంఘటనలు హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా చోటు చేసుకో వడం గమనార్హం. గన్ మిస్ ఫైరింగ్ వల్ల పోలీస్ కానిస్టే బుల్, ఎస్సై, ఓ డీఎస్పీ ఇలా చాలా మంది మరణించిన ఘటనలు చోటు చేసుకు న్నాయి. తాజాగా ఇవ్వాళ హైదరా బాద్ నార్సింగి బైరాగిగూడ లో బుల్లెట్ కలకలం సృష్టిం చింది. ఈ బుల్లెట్ ప్రమాదం లో ఎవ్వరికీ ఏమి కాకపోవ డంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బైరాగిగూడలోని ఓ అపార్టు మెంట్ లోని 5 అంతస్తులోని కిటికి అద్దాలు ధ్వంసం కావడంతో పాటు ఏకంగా బెడ్ రూమ్ లోకి బుల్లెట్ దూసుకొచ్చింది. దీంతో అపార్టుమెంట్ వాసులు పరుగులు తీశారు. ఆర్మీ ఫైరింగ్ రేంజ్ గన్ మిస్ ఫైర్ కావడంతో బుల్లెట్ దూసుకొచ్చినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకు న్నారు..

## పెద్ది మతి స్థిమితం లేని వ్యాఖ్యలు చేయద్దు....

### కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు భూక్య మోహన్ నాయక్



నర్సంపేట (గౌతమ్ న్యూస్): పెద్ది మతి స్థిమితం లేకుండా వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి తగదని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు భూక్య మోహన్ నాయక్ అన్నారు..ఈ రోజు విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16 చింతల గ్రామంలో జరిగిన జంట హత్యలు దారుణమని క్షమించరాని నేరమని నిందుతున్ని కఠినంగా శిక్షిస్తుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గతంలో జరిగిన సంఘటనలు గుర్తు చేసుకోవాలని ఆయన అన్నారు.మీ ప్రభుత్వం లో చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాక ఇదే మండలం అమృతండా కి చెందిన గిరిజన యువ నాయకుడు ఆత్మహత్య చేసుకుంటే పరామార్శకు వచ్చిన ఆనాటి ఎమ్మెల్యే పెద్ది బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని చెప్పి హామీ ఇచ్చి జాడ లేకుండా పోయిన విషయం మండల ప్రజలకు తెలుసునని అన్నారు.కాకతీయ యూనివర్సిటీ లో విద్యార్థి చనిపోతే కానీసం పరమార్షకు వెళ్ళలేదని ఆయన గుర్తు చేశారు.మా నాయకుడు ప్రజల్లో ఉండే నాయకుడని హత్య జరిగిన రోజున ఎమ్మెల్యే దొంతి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉండి ఆలస్యం అయితే మాజీ ఎమ్మెల్యే అవాక్కులు చెవాకులు మాట్లాడి పోయాడని కేవలం రాజకీయ లబ్ది కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని ఆయన హెచ్చరించారు.. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మా నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారు అండగా వుంటారని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ దళిత గిరిజనులకు అండగా ఉండే పార్టీ అని కాంగ్రెస్ పార్టీ చేసే అభి వృద్ధి చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే మతి లేకుండా మాట్లాడటం తగదు అని ఉపాధ్యక్షులు భూక్య మోహన్ నాయక్ అన్నారు.

## కేయూ హాస్టల్లో జరిగే ప్రమాద ఘటనలకు ప్రభుత్వామే బాధ్యత వహించాలి.పి.డి.ఎస్.యు



వరంగల్ (గౌతమ్ న్యూస్): గత కొంతకాలంగా కాకతీయ యూనివర్సిటీ పోతన హాస్టల్ లోని వివిధ రూములల్లో పై పెచ్చులు ఊడి విద్యార్థినిలపై పడి తీవ్ర గాయాల పాలవుతున్న ముందస్తుగా ప్రమాదాలు జరగకుండా అరికట్టే చర్యలు తీసుకోవడంలో సంబంధిత యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పి.డి.ఎస్.యు.రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు,కె.యు. అధ్యక్షులు అశోక్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కె.యు.లోని పోతన హాస్టల్ లోని పెచ్చులూడిపోయిన రూములను పి.డి.ఎస్.యు. ప్రతినిధి బృందం పరిశీలించి, విద్యార్థినీలకు మనోధైర్యాన్ని కలిగించడం జరిగింది. సందర్భంగా బి. నరసింహారావు అశోక్ లు మాట్లాడుతూ వివిధ జిల్లాల నుండి తల్లిదండ్రులను వదిలిపెట్టి ఉన్నతవిద్యనభ్యసించా డానికి కె.యు.కు వచ్చిన విద్యార్థినిల ప్రాణాలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత యూనివర్సిటీ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వానికి లేదా ?అని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే యూనివర్సిటీ అధికారులు హడావిడి చేస్తున్నారని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారే తప్ప ఆచరణలో కనీసం హాస్టల్స్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని తెలిపారు. యూనివర్సిటీ అధికారుల నిరంతర పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటి ప్రమాద ఘటనలు జరుగుతున్నా యని అన్నారు. హాస్టల్స్ లో జరిగే ప్రమాదాల వలన విద్యార్థినిలకు ఏదైనా జరగరానిది జరుగి ప్రాణ నష్టం సంభవిస్తే దానికి యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్. యు. యూనివర్సిటీ అభిరామ్ రమేష్, పృధ్వి, నరేష్,అనూష ,అఖిల, హైమ, పూజిత, సోనీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కీ.శే. సమ్మయ్య గౌడ్ కు గౌడ జర్నలిస్ట్ లు నివాళులు



హన్మకొండ(గౌతమ్ న్యూస్): ఆత్మకూర్ మండలం కొత్తగట్టు గ్రామంలో తూర్పు కోట జర్నలిస్ట్ ల పరపతి సంఘం అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ కోరుకొప్పుల నరేందర్ గౌడ్ తండ్రి సమ్మయ్య గౌడ్ ఇటీవల స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసిన గౌడ జర్నలిస్ట్ లు శనివారంఆయన స్వగృహం లో కీశే. సమ్మయ్య గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమం లో జర్నలిస్ట్ లు పెరుమాండ్ల వెంకట్ గౌడ్,పొగాకు అశోక్ గౌడ్,గుళ్ళపల్లి ఉమేందర్ గౌడ్ అనంతుల రమేష్ గౌడ్,వెంకటేశ్వర్లు గౌడ్,ఉమ్మగాని గణేష్ గౌడ్ ,సంపేట సుధాకర్ గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలను అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని ఝాన్సీ రెడ్డి ..





పాలకుర్తి(గౌతమ్ న్యూస్): రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వం లక్ష్యం అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి గారు అన్నారు.. శనివారం తొర్రురు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి గారు లబ్బిదారులకు అందచేసారు.. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో గల వివిధ మండలాలకు చెందిన అనారోగ్యానికి గురైన వివిధ గ్రామాలకు చెందిన 185 మంది బాధితులకు మంజురైన 49 లక్షల నాలుగు వేల రూపాయలు (49,04,000) చెక్కులను ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి గారు లబ్బిదారులకు అందచేసారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి గారు మాట్లాడుతు.. ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సిఎం రేవంత్ రెడ్డి గారు లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి గారు అన్నారు.. ప్రజా సంక్షేమం కోసం.. ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి గారు పిలుపునిచ్చారు.. దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రములో ప్రజాకర్షక పథకాలను రూపకల్పన చేసిన సిఎం రేవంత్ రెడ్డి గారు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బంగారు తెలంగాణ నిర్మాణమే ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి గారు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సిఎం రేవంత్ రెడ్డి గారికి ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని ఝాన్సి రెడ్డి గారికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు ఆమ్యా నాయక్, రాపాక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు సోమా రాజశేఖర్, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, రవీందర్ రెడ్డి, సురేష్ నాయక్, గిరగాని కుమారస్వామి, ముద్దసాని సురేష్, నల్ల శ్రీరామ్, పట్టణ వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు..

## వాతావరణ మార్పులను అధిగమించుటకు ఆగ్రో ఫారెస్ట్రీ వ్యవసాయ విధానం ఉత్తమం

నర్సంపేట (గౌతమ్ న్యూస్): డబ్ల్యు డబ్ల్యు ఎఫ్ -ఇండియావారి సహకారంతో సమ్మక్క సారక్క రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వారు సుస్థిర నేల యాజమాన్యం ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నారు. ప్రాజెక్ట్ లో







భాగంగా రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను అధిగమించుటకు ఆగ్రో ఫారెస్ట్రీ వ్యవసాయ విధానం (మామిడింపత్రి), (నిమ్మంపత్రి), (జామంపత్రి), (మునగ ం పత్రి) వల్ల రైతు నష్ట పోకుండా ఉండుటకు ఆగ్రో ఫారెస్ట్రీ వ్యవసాయ ఉపయోగ పడుతుంది అని నర్సంపేట పీయూ మేనేజర్ తీటి శ్రీధర్ తెలిపారు. ఈ సంస్థ వారు అందిస్తున్న నాణ్యమైన మామిడి, జామ, నిమ్మ, సపోటా, మునగ వంటి మొక్కలను రైతులు తీసుకొని తోటలు పెట్టుకోవాలని సూచించారు. నర్సంపేట మండలం , ఇప్పలతండా గ్రామంలో, గుగులోత్ ఈర్య మునగ తోట పెట్టుటకు సంస్థ వారు మొక్కలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత గారు సంస్థ సిబ్బంది స్రవంతి, కోటేశ్వరి ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## అనురాధ కుటుంబానికి 5000 ఆర్థిక సాయం

### మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఫౌండర్, మోటార్ వెహికల్ మానవత్వం చాటిన గంట రవీందర్ (ఇన్స్పెక్టర్)



కేసముద్రం (గౌతమ్ న్యూస్): మహబూబాద్ జిల్లా కేసముద్రం మండల పరిధిలోని కోరుకొండపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన సురేష్ కుమార్తె ఇంటర్మీడియట్ లో తక్కువ మార్కులు వచ్చిందని సూసైడ్ చేసుకున్న సంగతి తెలుసుకున్న మానవత వాది గంట రవీందర్ చేసిన సేవలలో ఇది ఒక సేవ నిరుపేదలకు నా సహాయం అందడమే అది ఒక్క గొప్ప అనుకునే అవకాశమని ఈయన మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఫౌండర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్. మన కులం కాదు, ఊరు, వాడ, ప్రాంతం కాదు. ఫోన్ చేసి కోరుకొండపల్లి సురేష్ ఆర్థిక స్థితి చెప్పేదాకా కూడా పూర్తిగా వినలేదు. వెంటనే 5వేలు రు"నా అకౌంట్ కు పంపారు. పంపిన విషయం కూడా నేను చూసుకునే వరకు తెలియదు. ప్రచారం అవసరం లేదు అంటూ ఎవరికీ చెప్పొద్దూ అంటూ సందేశాన్ని కూడా చెప్పారు. ఇంత ఎందుకు చెప్పానంటే మానవత్వానికి సంబంధించిన అంశం కాబట్టి. మనం సహాయం చేద్దాం అనుకుంటే మన స్థాయిలో లేకున్నా చుట్టూ ఉన్న వనరులను ఉపయోగించు కోవాలి. ఎవరో ఒకరు మానవత్వం ఉన్న హృదయం ఉన్న రవీందర్ సార్ లాంటి వాళ్ళను పరిశోధన చేయాలి. నేను ఫోన్ పే చేయగానే బాధితులకు లిక్విడ్ అమౌంట్ అందించిన వనం రణధీర్, హరీష్, రాకేష్ లకు అభినందనలు. బాధితులు చెప్పవలసిన అభినందనలు డబ్బులు పంపిన వారు చెప్పినారు అంటే వారి హృదయంలో పేదవాళ్లంటే వారికి ఉన్న ప్రేమ ఆప్యాయత ఆప్యాయత అనురాగం చెప్పలేనంత అలాంటి వ్యక్తికి బాధిత కుటుంబ సభ్యులు ఏనాడు చేసుకున్న రుణ ప్రాప్తి అని గోడును విలపించారు. ఆ దేవుడి మీలాంటి రూపంలో వచ్చి మాకు సహాయ సహకారాలు అందించినందుకు మీకు మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని బాధిత కుటుంభకులు తెలిపారు.

## కామ్రేడ్ గణేష్ 14వ వర్ధంతి

### గణేష్ కు విప్లవ జోహార్లు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య




బయ్యారం(గౌతమ్ న్యూస్): నక్సల్ భారీ ప్రేరణతో నింగికేసిన విప్లవోద్యమ కెరటం కామ్రేడ్ గణేష్ అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. కామ్రేడ్ గణేష్ 14వ వర్ధంతి సందర్భంగా గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో పూలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. 1969 నుండి ఖమ్మం వరంగల్, కరీంనగర్ నుండి శ్రీకాకుళం వరకు ఉవ్వెత్తున ఎగిసిన ఒక విప్లవోద్యమం ప్రజల నుండి సమరశీలమైన కార్యకర్తలను తయారు చేసిందని, ఆ కోవలోనే కామ్రేడ్ గణేష్ వస్తాడని, వారు అన్నారు. అటువంటి ఉద్యమంపై ఒకవైపు గ్రామాల్లో పెత్తందారులు, మరోవైపు పాలకవర్గాలు ముప్పేట దాడి చేశాయని, విప్లవోద్యమం పేరుతో కొన్ని పార్టీలు ప్రజలపై దాడి చేసినప్పుడు కొత్తగూడ ప్రాంతంలో పదుల సంఖ్యలో కార్యకర్తలు తమ ప్రాణాలు కోల్పోయారని వారు తెలిపారు. ప్రజా ఉద్యమాన్ని అణచడం కోసం రాజ్యాం కక్ష కట్టి ఆ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న గణేష్ ను అతికిరాతకంగా బూటకపు ఎన్కౌంటర్ పేరుతో హత్య చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గాల రాజకీయాలను సవాల్ చేస్తూ, ప్రతిఘటన రాజకీయాలను ముందుకు తీసుకపోవడంలో ఘనమైన పాత్ర పోషించాడని వారు కొనియాడారు. ముస్మీ, లడాయి గడ్డ, బక్క చింతలపల్లి, కాచన పల్లి, రోల్లగడ్డ ఎన్కౌంటర్లు అన్ని రాజ్య హింస లో భాగంగానే దళారి పాలకులు చేపించిన హత్యాకాండ అని విమర్శించారు. కామ్రేడ్ గణేష్ అనుసరించిన బాట అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయాలను ముందుకు తీసుకపోవడమే ఆయనకి ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ రామగిరి బిక్షం,పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు తుడుం వీరభద్రం, పిడిఎస్యు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నేతకాని రాకేష్,పార్టీ నాయకులు బి రెడ్డి సంగన్న, వీరబోయిన ఐలయ్య, కొదుమూరి నాగేశ్వరరావు, ఏనుగుల మురళి, కూనూరి యుగంధర్, రెడ్డిమల్ల విశ్వనాథం, జర్రిపోతుల బుచ్చయ్య, నిడికొండ మహేష్, పొన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కంబోడియా సైబర్ నేరగాళ్ల కేసులో మరో నిందితుడు అరెస్టు..



ఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కంబోడియా సైబర్ నేరగాళ్ల కేసులో కీలక నిందితుణ్ని సైబర్ సెక్యూరిటీ పోలీసులు అరెస్టు చేశారు. చైనీయులతో చేతులు కలిపి భారతదేశానికి చెందిన నిరుద్యోగులను కంబోడియా పంపించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న అబ్దుల్ అలాంను ఢిల్లీలో పట్టుకున్నారు. కంబోడియాలో సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుకుని దేశానికి తిరిగివచ్చిన సిరిసిల్లకు చెందిన బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఇదే కేసుకు సంబంధించి స్థానిక ఏజెంట్ సాయి ప్రసాద్ సహా ఢిల్లీకి చెందిన అన్సారిని పోలీసులు అరెస్టు చేయగా.. తాజాగా మరో నిందితుడు అబ్దుల్ అలాంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముఠా సభ్యులంతా నిరుద్యోగులే లక్ష్యంగా నెలకు 1000 డాలర్ల వేతనం ఇస్తామంటూ ప్రకటనలు ఇస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన 500నుంచి 600మందిని కంబోడియా తరలించారు. అనంతరం వారి పాస్‌పోర్టులు లాక్కొని సైబర్ నేరాలు చేయించేవారు. రోజుకు 16గంటలకు పైగా పని చేయిస్తూ.. నిరాకరించిన వారిని చిత్రహింసలకు గురి చేశారు. ఈ విధంగా సైబర్ నేరాల ద్వారా రూ.500కోట్ల దోపిడీ జరిగినట్లు కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖ, ఐ4సీ సమీక్షలో తేలింది. దీనిపై అప్రమత్తమైన భారత ప్రభుత్వం కొంతమందిని తిరిగి దేశానికి రప్పించింది. తాజాగా మరో నిందితుణ్ని అరెస్టు చేయడంతో మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## "శుభ్ ఆశీర్వాద్" వేడుకకు హాజరైన ప్రధాని మోడీ..



నూతన వధూవరులు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల 'శుభ్ ఆశీర్వాద్' వేడుకకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్, ఎండీ ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, పారిశ్రామికవేత్త వీరేన్ మర్చంట్ కుమార్తె రాధిక వివాహం శుక్రవారం ముంబైలో అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. శనివారం ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆశీర్వాద వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రధాని మోడీ జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకోగానే ముఖేష్ అంబానీ, నీతా అంబానీ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అనంత్, ఆకాష్ ఇద్దరూ పాదాలను తాకి ప్రధాని మోడీ ఆశీస్సులు తీసుకున్నారు. శనివారం.. బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, షాహిద్ కపూర్ మరియు మాధురీ దీక్షిత్‌లతో సహా భారతదేశం, విదేశాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు. అమెరికన్ రియాలిటీ టీవీ ఆర్టిస్ట్ కిమ్ కర్దాషియాన్ మరియు ఆమె సోదరి ఖ్లో కర్దాషియాన్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అమితాబ్ బచ్చన్ రంగురంగుల కుర్తా-పైజామా మరియు శాలువా ధరించి ఫంక్షన్‌కు వచ్చారు. ఈ సమయంలో మనవరాలు నవ్య నంద, అల్లుడు నిఖిల్ నంద కూడా ఆయన వెంట ఉన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా.. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతుల్ని.. ముఖేష్ అంబానీ.. చంద్రబాబు దంపతులకు పరిచయం చేశారు. చంద్రబాబు ప్రత్యేకంగా అనంత్ అంబానీతో ముచ్చటించారు. నూతన దంపతులైన అనంత్, రాధికను చంద్రబాబు దంపతులు ఆశీర్వదించారు.

## ఏపీలో రూ.27వేల కోట్లతో నాలుగు ప్రధాన ఓడరేవుల ఆధునికీకరణ



అమరావతి: రాష్ట్రంలోని నాలుగు ప్రధాన ఓడరేవుల్ని రూ.27వేల కోట్లతో ఆధునికీకరణ, సామర్థ్యం పెంపుపై ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. విశాఖ, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల విస్తరణపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనశాఖ నిర్ణయించింది. ఈ అంశంపై అధికారులతో ఆ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నాలుగు ప్రధాన ఓడరేవుల ఆధునికీకరణ, సామర్థ్యం పెంపుపై ప్రణాళికను రూపొందించటం ద్వారా ఏపీలో పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అయ్యేలా చూడాలని ప్రభుత్వం యోచిస్తోంది. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌తో పాటు నాలుగు పోర్టులను అనుసంధానిస్తూ రహదారి మార్గాలు, వివిధ ప్రాజెక్టులు, పోర్టులకు సమీపంలో అనుబంధ లాజిస్టిక్ కారిడార్‌ల నిర్మాణం లాంటి ప్రాజెక్టులను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించారు. సమీక్షకు పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ కార్యదర్శి సురేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ తదితరులు హాజరయ్యారు.

## గ్రూప్-1పై కీలక ప్రకటన..
## ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ



గ్రూప్-1పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. టీజీఎస్పీఎస్సీ పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చినట్టుగానే 1:50 రేషియోలో ఉద్యోగాల భర్తీ ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పుడు కొందరు 1:100 పిలవాలని కోరుతున్నారు.. తమకేం ఇబ్బంది లేదు పిలవడానికి.. కానీ కోర్టుల్లో ఇబ్బంది ఎదురవుతుందనిన సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గ్రూప్ 1 వ్యవహారం మళ్ళీ మొదటికి వస్తుంది.. నోటిఫికేషన్ లో ఇచ్చిన విధంగానే ఉద్యోగాల భర్తీ ఉంటుందని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఏ పరీక్ష రాయలేనోడు ఉద్యోగాలు వాయిదా వేయాలని దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. నిన్న మొన్న దీక్ష చేసిన ముగ్గురు.. ఏ ఒక్క పరీక్ష రాసిన దాఖలాలు లేవని అన్నారు. ఏ ఉద్యోగానికి పరీక్ష రాయలేనోడు.. పరీక్షలు వాయిదాలు వేయాలని దీక్ష చేస్తున్నారని మండిపడ్డారు. ఇదొక విచిత్రమైన పరిస్థితి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని సీఎం తెలిపారు. ఇప్పటివరకు ఎప్పుడూ ఏ ఉద్యోగానికి నోటిఫికేషన్లు వస్తాయో.. ఎప్పుడు పరీక్షలు జరుగుతాయో తెలియదన్నారు. జాబ్ క్యాలెండరు విడుదల తర్వాత ఉద్యోగాలు భర్తీ ఎప్పుడు జరుగుతాయని క్లారిటీ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. జాబ్ క్యాలెండర్ కి చట్టబద్ధత ఉందన్నారు. మార్చి నెల ఆఖరి వరకు అన్ని శాఖలలో ఖాళీల వివరాలు తెప్పిస్తాం.. ప్రతి ఏడాది ఇదే వ్యవహారం కొనసాగుతుందని సీఎం చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగుల ఖాళీల ప్రకారం ఎలాగైతే నోటిఫికేషన్లు వస్తాయో.. తెలంగాణలో ఉద్యోగాల ఖాళీల భర్తీ అలాగే ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రభంజనం..
# కూటమికి 10, బీజేపీకి 02..





ఏడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటింది. మొత్తం 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 10 స్థానాలను కూటమి కైవసం చేసుకోగా, బీజేపీ కేవలం 02 సీట్లకు మాత్రమే పరిమితమైంది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్ మరియు తమిళనాడులోని 13 అసెంబ్లీ స్థానాలకు బుధవారం ఉపఎన్నికలు జరగగా, ఈ రోజు ఫలితాలు వెలువడ్డాయి. పంజాబ్ జలంధర్ వెస్ట్ నుంచి ఆప్‌కి చెందిన మోహిందర్ భగత్ విజయం సాధించారు. బెంగాల్‌లో నాలుగు స్థానాలను అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) గెలుచుకుంది. ఈ స్థానాల్లో బీజేపీ రెండో స్థానానికి పరిమితమైంది. తమిళనాడులోని విక్రవాండిలో అధికార డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ గెలుపొందారు. ఇక హిమాచల్ ప్రదేశ్‌లో 03 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగగా, రెండు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు భార్య కమలేష్ ఠాకూర్ తొలిసారిగా ఎన్నికల బరిలో నిలిచి బీజేపీ కంచుకోట డెహ్రా నియోజకవర్గంలో విజయం సాధించారు. ఈ రాష్ట్రంలో నలాగడ్‌లో కాంగ్రెస్ గెలవగా, హమీర్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి ఆశిష్ శర్మ విజయం సాధించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో బద్రీనాథ్, మంగ్లూర్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. మంగ్లూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఖాసీ మహ్మద్ నిజాముద్దీన్, బీజేపీ అభ్యర్థి ఖటార్ సింగ్ భదానాపై కేవలం 400 ఓట్ల తేడాతో గెలిచారు. మధ్యప్రదేశ్‌లోని అమర్వార్‌లో బీజేపీ అభ్యర్థి కమలేష్ ప్రతాప్ షాహి విజయం సాధించారు. బీహార్ రూపాలీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థి శంకర్ సింగ్ విజయం సాధించారు.

## కేజ్రీవాల్ హెల్త్‌పై ఆప్ రిపోర్టు విడుదల..
### ఆందోళనలో శ్రేణులు!



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆయన ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం బయటకు వచ్చింది. కేజ్రీవాల్ దాదాపు 8.5 కిలోల బరువు తగ్గారని.. అలాగే బ్లడ్ షుగర్ కూడా 50 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా పడిపోయిందని ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్ ఆరోపించారు. దీంతో ఆప్ నేతలు ఆందోళన చెందుతున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మార్చి 21న అరెస్టై తీహార్ జైల్లో ఉన్నారు. పలుమార్లు బెయిల్ పిటిషన్లు వేసినా తిరస్కరణకు గురయ్యాయి. ఆ మధ్యలో ట్రయల్ కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. కానీ సీబీఐ రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. హైకోర్టుకు వెళ్లి అడ్డుకోవడంతో ఆగిపోయింది. ఇటీవల ఈడీ కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ మరో సీబీఐ కేసులో బెయిల్ రాకపోవడంతో ఇంకా జైల్లోనే కేజ్రీవాల్ మగ్గుతున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల కోసం మాత్రం 21 రోజులు సర్వోన్నత న్యాయస్థానం తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం జూన్ 2న తిరిగి తీహార్ జైల్లో లొంగిపోయారు. శనివారం సంజయ్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. తీహార్ జైల్లో కేజ్రీవాల్‌ను తీవ్రమైన వ్యాధితో బాధపెట్టడానికి కుట్ర పన్నుతోందని.. ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసినప్పుడు కేజ్రీవాల్ బరువు 70 కిలోలు అని, ప్రస్తుతం బరువు 61.5 కిలోలకు తగ్గిందని సంజయ్‌సింగ్ చెప్పారు. ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం వల్లే కేజ్రీవాల్ బరువు తగ్గడానికి కారణమని పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు చేస్తున్న అవినీతి కేసులో అరెస్టు అయినందున కేజ్రీవాల్ ఇప్పటికీ జైలులోనే ఉన్నారని వెల్లడించారు. సుప్రీంకోర్టు నుంచి ఉపశమనం లభించవచ్చన్న దురుద్దేశంతోనే సీబీఐ కేజ్రీవాల్‌పై కల్పిత కేసు పెట్టిందని.. ఇదంతా ఆయన జీవితంతో ఆడుకోవడం కోసమేనని సంజయ్ సింగ్ ఆరోపించారు.

## పాక్ కు భారీ ఉపశమనం..
## రుణ ప్యాకేజీకి అంతర్జాతీయ ద్రవ్య నిధి గ్రీన్ సిగ్నల్




తీవ్ర ఆర్థిక సంక్షోంభంలో చిక్కుకున్న పాకిస్థాన్ కు తీపి కబురందింది. బెయిలౌట్ ప్యాకేజీ కోసం పాక్ నెలల తరబడి అంతర్జాతీయ ద్రవ్య నిధి ని నిరంతరం సంప్రదించింది. కొన్ని వారాల క్రితం.. ఐఎంఎఫ్ ఉన్నత స్థాయి కమిటీ ఆ దేశంలో పర్యటించి ప్రభుత్వం తీసుకున్న చర్యలను సమీక్షించింది. ప్రస్తుతం పాక్ కు 7 బిలియన్ల యూఎస్ డాలర్ల రుణ ప్యాకేజీని ఆమోదించింది. అయితే దీనికి పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆర్థిక, ఆర్థిక సంస్కరణలతో పాటు పన్ను బేస్ కూడా పెంచాల్సి ఉంటుంది. సబ్సిడీ విషయంలోనూ సంస్కరణలు తప్పవు. దీని వల్ల సామాన్య ప్రజలతో పాటు ముఖ్యంగా రైతులు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదులకు స్వర్గధామంగా పేరొందిన పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి కొన్నేళ్లుగా చాలా దారుణంగా ఉంది. దీంతో అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద మోకరిల్లింది. ఆర్థిక సంస్కరణలను చేపట్టాలని ఐఎమ్ఎఫ్ పాక్ కు సలహా ఇచ్చింది. కొన్ని వారాల క్రితం.. అకస్మాత్తుగా పాక్ లో పర్యటించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. "కఠినమైన షరతులతో కూడిన బెయిలౌట్ ప్యాకేజీ ప్రణాళికకు ఐఎమ్ఎఫ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఓ వైపు పన్ను బేస్ పెంచవలసి ఉంటుంది. మరోవైపు సబ్సిడీలను కూడా క్రమబద్ధీకరించవలసి ఉంటుంది. దీంతోపాటు వ్యవసాయ పన్నుల విషయంలో కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి." అని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి రుణం పొందినందుకు కృషి చేసిన పాక్ ఆర్థిక మంత్రి ముహమ్మద్ ఔరంగజేబ్‌ను ప్రధాని షాబాజ్ ప్రశంసించారు.

# నాడు హీరో అన్నారు.. నేడు జీరో అంటున్నారు..!




లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ మరింత బలహీనపడుతూ వస్తోంది. గతంలో కేసీఆర్‌ను హీరో అంటూ ప్రశంసించిన వాళ్లే.. అధికారం పోయే సరికి.. కేసీఆర్ జీరో అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. బీఆర్ఎస్‌కు రాజకీయ భవిష్యత్తు లేదంటూ చాలామంది గులాబీ పార్టీ నేతలు ఇతర పార్టీల్లో చేరుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపు ఎక్కువమంది మొగ్గు చూపిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలవగా.. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఆ సీటును కాంగ్రెస్ గెలవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 38కి చేరింది. ప్రస్తుతం 9 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 29కి చేరింది. ఓ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మరో పార్టీలో చేరితే పదవికి రాజీనామా చేయాల్సి వస్తోంది. అదే ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో 2/3వంతు వేరే పార్టీలో చేరితే పార్టీ శాసనసభా పక్షం విలీనమైనట్లు పరిగణిస్తారు. దీంతో ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వర్తించదు. ఈ ప్లాన్‌లో భాగంగా మొత్తం 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకునేందుకు హస్తం పార్టీ ప్లాన్ రెడీ చేసింది. ఇప్పటికే 9మందిని చేర్చుకోగా.. మిగిలిన 17 మందిని మరో 15 రోజుల్లో చేర్చుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అవుతుందని.. ఇద్దరు నుంచి ముగ్గురే ఆ పార్టీలో మిగులుతారంటూ దానం సంచలన వ్యాఖ్యలు చేశారు.

### గతంలో ఏం జరిగిందంటే..

2019 ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ సంపూర్ణ మెజార్టీ సాధించినప్పటికీ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకున్నారు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడకుండా కాంగ్రెస్ ఎల్పీని విలీనం చేసేలా స్కెచ్ వేసి సక్సెస్ అయ్యారు. ఐదేళ్ల తర్వాత బీఆర్ఎస్‌ను గద్దెదించి.. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించారు. గతంలో కేసీఆర్ కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు పెట్టడంతో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రతీకారం తీర్చుకునే పనిలో పడిందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ మాత్రం తమ ప్రభుత్వ పనితీరు, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరుతున్నారని చెబుతున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వరని.. ఆ పార్టీలో నేతలు ఇమడలేకపోతున్నారని.. త్వరలోనే ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. మరో 15 రోజుల్లో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని.. ఆ పార్టీలో మిగిలేది ఇద్దరు నుంచి ముగ్గురు మాత్రమేనన్నారు. దీంతో కాంగ్రెస్ ఇప్పటికే మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అదే సమయంలో దానం నాగేందర్ మరిన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అండతో అక్రమాలకు పాల్పడిన వాళ్లను వదిలిపెట్టబోమని.. అందరి పేర్లు బయటకు తీస్తామని హెచ్చరించారు. కొంతమంది పేర్లను సైతం దానం నాగేందర్ బయటపెట్టారు. జైలుకు వెళ్లి వచ్చినోళ్లు కోట్ల రూపాయిలు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. అందరి సంగతి తేలుస్తామంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇదే దానం నాగేందర్ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంతకాలం కేసీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఈటల రాజేందర్ కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేసిన సమయంలోనూ గులాబీ బాస్‌కు మద్దతుగా నిలిచారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత కేసీఆర్, పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

### రేవంత్ ప్లాన్ ఇదేనా..

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒక ఎమ్మెల్యే సీటును గెల్చుకోలేదు. దీంతో రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన బలాన్ని పెంచుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి పక్కా వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. గ్రేటర్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకొస్తే మంత్రి పదవి ఇస్తామంటూ దానం నాగేందర్‌కు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చే పూర్తి బాధ్యతల్ని దానం నాగేందర్ తన భుజస్కందాలపై వేసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని గెలవడంతో పాటు.. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో మేయర్. ఛైర్మన్ పదవులు గెలవడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. ఓ టార్గెట్‌ను ఫిక్స్ చేసి.. బీఆర్ఎస్ మొత్తాన్ని ఖాళీ చేయాలనే హస్తం పార్టీ ప్లాన్ వర్కౌట్ అవుతుందా లేదా అనేది త్వరలోనే తేలనుంది.

# జగన్నాథ రహస్యం!



లక్షలాది భక్తజనం పాల్గొనే విశ్వవిఖ్యాత రథయాత్రతో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పూరీ జగన్నాథుని ఆలయం మరోమారు పతాక శీర్షికలకెక్కింది. రాజుల నుంచి మొదలుకుని సామాన్యుల దాకా శతాబ్దాలుగా జగన్నాథస్వామికి సమర్పించుకున్న కానుకల చిట్టా గుట్టు వీడబోతోంది. ఆదివారం ఆలయం దిగువన ఉన్న ఆభరణాల నిల్వ గది(రత్న భండార్)ని దాదాపు 40 సంవత్సరాల తర్వాత లెక్కింపు కోసం తెరవబోతున్నారు. విషసర్పాలు ఉండొచ్చన్న వార్తల నేపథ్యంలో అత్యయిక ఔషధాలను సిద్ధంచేసి వైద్యులు, పాములు పట్టే వాళ్లను వెంటబెట్టుకునిమరీ పురావస్తు, ప్రభుత్వ అధికారులు లోనికి వెళ్లబోతున్నారు. జగన్నాథుడికి చెందిన వజ్ర, వైఢూర్యాలు, గోమేధిక, పుష్యరాగాలు, కెంపులు, రత్నాలు, స్వర్ణాభరణాలు, వెండి తదితరాల బరువును తూచి, వాటి నాణ్యతను పరిశీలించి వేరే గదిలో సురక్షితంగా భద్రపరచాలని నిర్ణయించారు. చాన్నాళ్ల క్రితం గది తాళం చెవులు పోగొట్టి ఒడిశాలోని బిజూజనతాదళ్ సర్కార్ ఆలయ సంపద సంరక్షణలో విఫలమైందని బీజేపీ అసెంబ్లీ ఎన్నికలవేళ ఆరోపణలు గుప్పించడంతో గది తలుపులు తెరచి సంపదను సరిచూడాలన్న డిమాండ్ మళ్లీ ఊపందుకుంది. అయితే గది తెరవడంపై శనివారం తుది నిర్ణయం తీసుకుంటామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శుక్రవారం చెప్పారు.

### 180 రకాల ఆభరణాలు

1978లో గదిని తెరచి ఆభరణాలు, వెండి, బంగారం నిల్వలను లెక్కించి మళ్లీ పొడవాటి చెక్కపెట్టెల్లో భద్రపరిచారు. ఆనాడు అన్నింటినీ లెక్కించడానికి 70 రోజులు పట్టింది. గదిలో 180 రకాలకు చెందిన అమూల్యమైన ఆభరణాలు స్వామివారికి ఉన్నట్లు సమాచారం. స్వచ్ఛమైన పసిడి ఆభరణాలు 74 రకాలున్నాయి. ఒక్కోటి 100 తులాల బరువైన పురాతన ఆభరణాలూ ఉన్నాయి. " 1978లో సంపద లెక్కించారు. అయితే జీర్ణావస్థకు చేరిన కొన్ని ఆభరణాల రిపేర్ పనుల కోసం 1985 జూలై 14వ తేదీన గది తెరిచారు. అప్పుడు నేనూ వెళ్లా. 9 అడుగుల పొడవు, 3 అడుగుల ఎత్తు ఉన్న 15 చెక్కపెట్టెల్లో ఆభరణాలను జాగ్రత్తగా భద్రపరిచారు. వెలకట్టలేని ఆభరణాలతోపాటు ఎంతో బంగారం, వెండి నిల్వలు గదిలో దాచారు. పెద్ద సింహాసనం, ఉత్తరభారత భక్తులు జగన్నాథ, బలభద్రులకు సమర్పించిన అరటిపువ్వు ఆకృతి చెవిదిద్దులు ఇలా ఎన్నో విభిన్న ఆభరణాలు అక్కడున్నాయి. తర్వాత గది తలుపులు మూసి రెండు రకాల తాళాలు వేసి సీల్‌వేశారు. తాళం చెవులను ట్రెజరీ ఆఫీస్ నుంచి వచ్చిన కలెక్టర్‌కు అందజేశాం' అని ఆనాటి ఆలయ నిర్వహణ అధికారి రవీంద్ర నారాయణ మిశ్రా రెండేళ్ల క్రితం ఒక టీవీచానల్ ఇంటర్వ్యూలో చెప్పారు. 12వ శతాబ్దంలో పూరీ ప్రాంత రాజుకు లొంగిపోయిన సామంతరాజుల కిరీటాలు, యుద్ధంలో గెల్చుకున్న విలువైన సొత్తునూ రహస్య గదిలో భద్రపరిచారని తెలుస్తోంది.

### 2018లో మరోసారి ప్రయత్నించి..

పురాతన గది శిథిలమై గోడలకు చెమ్మ రావడంతో గది పటిష్టత, ఆభరణాల పరిరక్షణ నిమిత్తం గది తలుపులు తెరవాలని హైకోర్టు ఆదేశాల మేరకు 2018 ఏప్రిల్ 4వ తేదీన 16 మంది సభ్యుల భారత పురావస్తుశాఖ నిపుణుల బృందం గది తెరిచేందుకు వెళ్లింది. అయితే తాళం చెవి అదృశ్యమయిందన్న వార్తల నడుమ వెనుతిరిగింది. అయితే కిటికీ నుంచి చూసి గది గోడలు దెబ్బతిన్నట్లు, పైకప్పు పెచ్చులు ఊడినట్లు నిర్ధారించుకున్నారు. ఈ తతంగం అంతా 40 నిమిషాల్లో ముగిసింది. చీకటిగదిని మళ్లీ 40 ఏళ్ల తర్వాత తెరుస్తున్న నేపథ్యంలో ఈసారైనా అన్ని ఆభరణాలు, బంగారం, వెండి నిల్వలను సరిచూసి శిథిల గదికి బదులు నూతన గదిలో సురక్షితంగా దాచాలని సగటు పూరీ జగన్నాథుని భక్తుడు కోరుకుంటున్నాడు.

# విజ్ఞత మరిచిన నాటో!



వ్యక్తిగా ఒక్కరు తీసుకునే నిర్ణయం కంటే సమష్టి నిర్ణయమే ఎప్పుడూ సరైందని పెద్దలు చెబుతారు. కానీ వాషింగ్టన్‌లో మూడు రోజులపాటు జరిగిన నాటో 75 ఏళ్ల వార్షికోత్సవాల్లో దేశాధినేతలు మాట్లాడిన తీరు చూసినా, చివరిలో ప్రకటించిన డిక్లరేషన్ గమనించినా పరిణతికన్నా పరమ మూర?త్వమే కనబడుతుంది. మూడో ప్రపంచ యుద్ధం దిశగా ప్రపంచ దేశాలను కదిలించే ప్రయత్నం దర్శనమిస్తుంది. రష్యా దురాక్రమణపై పోరాడుతున్న ఉక్రెయిన్‌కు వచ్చే ఏడాదిలోగా సైనిక సాయం రూపంలో కనీసం 4,000 కోట్ల యూరోలు అందజేయాలని నాటో సంకల్పించింది. అంటే రెండున్నరేళ్లుగా వేలాదిమంది మరణాలకూ, కోట్లాది డాలర్ల ఆస్తుల విధ్వంసానికీ కారణమైన ఆ యుద్ధాన్ని మరింత ఎగదోస్తూ పోతారన్నమాట! ఇంకా విడ్డూరమేమంటే నెదర్లాండ్స్ భూభాగంలో ఎఫ్-16 యుద్ధ విమానాలను మోహరించి రష్యాపై దాడులకు ఉక్రెయిన్‌ను పురిగొల్పుతారు. అంతేకాదు... ఎన్నడూ లేనివిధంగా తొలిసారి చైనాపై నాటో నిప్పులు చెరిగింది. దురాక్రమణ యుద్ధం కొనసాగించేందుకు రష్యాకు దన్నూ, ధైర్యమూ ఇస్తున్నది చైనాయేనని డిక్లరేషన్ ఆరోపించింది. నాటో ఎప్పుడూ చైనా జోలికి పోలేదు. అయిదేళ్లుగా చైనా వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మాట వాస్తవం. అది కూడా చాలా మర్యాదైన, మృదువైన పదాలతోనే! ఇప్పుడేమైంది? నాటో కొత్త రాగం వెనకున్న కారణమేమిటి నిజానికి నాటో సదస్సులో ఈసారి జో బైడెన్ ఆరోగ్యం, ఉక్రెయిన్ యుద్ధం, గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ ప్రస్తావనకొస్తాయని అందరూ ఆశించారు. అమెరికా అధ్యక్ష పదవి రేసులో బైడెన్ ఆరోగ్యం ప్రధాన అంశంగా మారింది. ఆయన కొనసాగితే ఓటమి ఖాయమని డెమాక్రాట్లు నిర్ణయానికొచ్చారు. సర్వేలు సైతం రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ బలపడుతున్న వైనాన్ని ఏకరువు పెడుతున్నాయి. అందుకే నాటో స్వరం మారిందని విశ్లేషకుల ఆరోపణ. ట్రంప్ వస్తే నాటో ఉనికే ప్రశ్నార్థకం కావటం ఖాయం. ఉక్రెయిన్ భవిష్యత్తు అనిశ్చితం. గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ వల్ల ఇంతవరకూ 1,86,000 మంది పౌరులు మరణించారని లాన్సెట్ నివేదిక అంచనా. ఈ నేపథ్యంలో ఆ యుద్ధాన్ని నివారించటంపై నాటో దృష్టి పెడుతుందని అందరూ అంచనా వేయగా, తీరా దాని గురి చైనా వైపు మళ్లింది! మరోపక్క భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటీ... ఘర్షణల సమయంలో 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' ఉండదంటూ పరోక్షంగా మనల్ని హెచ్చరించారు. 'అవసర సమయాల్లో' భారత్, అమెరికాలు సమష్టిగా పనిచేయాల్సి వుంటుందని చెప్పారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటనపై లోపాయికారీగా మన అధికారుల వద్ద అమెరికా అసంతృప్తి వ్యక్తంచేసినట్టు కథనాలొచ్చాయి. గార్సెటీ దాన్నే బహిరంగంగా చెప్పారు.రెండేళ్లక్రితం తాను చెప్పిందేమిటో అమెరికాకు గుర్తుందా? ఉక్రెయిన్‌కు చేయూతగా పోలాండ్ నుంచి మిగ్-29 యుద్ధ విమానాలను రంగంలోకి దించటానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తామని 2022 మార్చిలో అమెరికా విదేశాంగమంత్రి బ్లింకెన్ చేసిన ప్రకటనను అమెరికా రక్షణ శాఖ తప్పుబట్టింది. ఇందువల్ల రష్యా తీవ్రంగా ప్రతిస్పందించే ప్రమాదం వుంటుందని పెంటగాన్ ప్రతినిధి జాన్ కిర్బీ హెచ్చరించారు. ఆ సమయంలోనే జో బైడెన్ సైతం ఉక్రెయిన్ గగనతలంపై నాటో నో ఫ్లైజోన్ విధించాలన్న ప్రతిపాదనను కొట్టిపడేశారు. దాన్ని అమలు చేయటానికి నాటో నేరుగా యుద్ధరంగంలోకి దిగాల్సివస్తుందని చెప్పారు. మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభించాలని అమెరికా భావించటం లేదని అన్నారు. ఆఖరికి నాటోలో ప్రధాన భాగస్వాములైన జర్మనీ, ఫ్రాన్స్ సైతం అదే ఉద్దేశంతో ఉన్నాయి. నిరుడు ఫిబ్రవరిలో ఒక విందు సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి జర్మనీ చాన్సలర్ ఓలోఫ్ షుల్జ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియేల్ మేక్రాన్‌లు హితవు చెప్పారు. 'ఈ యుద్ధంలో మీరు ఓడిపోబోతున్నారు. కనుక రష్యాతో చర్చలకు సిద్ధపడి సంధి చేసుకోవటం అత్యుత్తమం' అని సలహా ఇచ్చారు. హిట్లర్ కాలంలో జర్మనీ తమ దేశాన్ని దురాక్రమించినా ఆ తర్వాత జర్మనీ, ఫ్రాన్స్‌లు రెండూ పాత వైరాన్ని మరిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. 'నువ్వు గొప్ప యుద్ధ వీరుడివే కావొచ్చుగానీ... ఈ వైరంలో రాజనీతిజ్ఞత అవసరం. నొప్పి కలిగించినా కష్టమైన నిర్ణయం తీసుకోవటానికి సిద్ధపడాలి' అని జెలెన్‌స్కీకి మేక్రాన్ హితబోధ చేశారు. అవన్నీ ఏమైనట్టు? నాటో పుట్టిననాటి నుంచి దాన్ని కొనసాగించటానికి అమెరికా సాకులు వెదుకుతూనే వుంది. సోవియెట్ యూనియన్ పెను భూతమనీ, అది యూరప్‌ను కబళించబోతున్నదనీ ఊదరగొట్టి ఏర్పరిచిన నాటో ఉనికిని కాపాడేందుకు పడరాని పాట్లు పడుతోంది. 1989లో పనామా పాలకుడు నొరీగా, 1999లో సెర్బియా పాలకుడు స్లోబోదన్ మైలోసెవిక్, 2003లో ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్‌లు ప్రపంచాన్ని కబళించటానికి సిద్ధంగావున్న హిట్లర్‌లుగా చిత్రీకరించి ఆ దేశాలపై అమెరికా, నాటో దళాలు విరుచుకుపడి గుల్లచేశాయి. లక్షలాదిమంది అమాయక పౌరులు బలయ్యారు. ఇన్నాళ్లకు నాటోకు యూరప్‌లో పుతిన్ రూపంలో శత్రువు 'తారసపడ్డాడు'. ఆ లంపటంలోకి ప్రపంచ దేశాలన్నిటినీ దించి లోకరక్షకుడిగా ఆవిర్భవించాలని అమెరికా తలపోస్తున్నట్టు కనబడుతోంది. రష్యా అణ్వాయుధాల ప్రయోగానికి దిగదని అమెరికా, నాటోలు నమ్ముతున్నట్టున్నాయి. ఇలాంటి తప్పుడు సూత్రీకరణలతో, అసంబద్ధ అంచనాలతో ప్రపంచాన్ని యుద్ధంలోకి నెడితే ఊహకందని పర్యవసానాలు ఏర్పడే ప్రమాదముంది. అగ్రరాజ్యాలు విజ్ఞతతో మెలిగి ఉక్రెయిన్, రష్యాల మధ్య సంధికి ప్రయత్నించాలి. ఆ మేరకు ప్రపంచ ప్రజానీకం ఒత్తిడి తేవాలి.

## మారనున్న కుప్పం రూపురేఖలు..
## సీఎం ఆదేశాలతో అభివృద్ధి వైపు వేగంగా అడుగులు..!




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పం రూపురేఖలు మారిపోతున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.. కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టించడానికి చకచక అడుగులు పడుతున్నాయి. ఎన్నికల అనంతరం సీఎం హోదాలో కుప్పంలో పర్యటించిన చంద్రబాబు.. పలుకీలకమైన హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీల్లో భాగంగా తొలుత.. కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ను తిరిగి ప్రారంభించారు. కుప్పం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 1995లోనే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో డీఆర్‌డీఏ పీడీ, సబ్ కలెక్టర్ స్థాయి అధికారులను ప్రాజెక్టు అధికారులుగా కొనసాగారు. 2004 వరకు కొనసాగిన కడాను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. చంద్రబాబు మూడో దఫా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి తర్వాత 2014లో మళ్లీ పునరుద్ధరించారు. ఐదేళ్ల పాటు ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేశారు. అయితే, వైసీపీ హయాంలో ఆ ప్రాజెక్టుకు అటకెక్కించారు. ఇక, ప్పం పురపాలికతో పాటు కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వేగవంతంలో 'కడా' కీలకంగా మారనుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా నిలవనుంది. అభివృద్ధి ప్రణాళిక రూపకల్ప, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బీ, నీటి పారుదల, విద్యుత్తు, గ్రామీణాభివృద్ధి, డ్వామా, అటవీ, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యానం, పశుసంవర్ధక, హౌసింగ్, నిత్యావసరాలు, ఐసీడీఎస్ తదితర శాఖల తోపాటు అన్ని సంక్షేమ విభాగాల్లో కార్యక్రమాల అమలు, అధికారుల విధులు, బాధ్యతలపై పర్యవేక్షణ, సమీక్షల అధికారాన్ని పీడీకి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అభీష్టం మేరకు పునర్ ప్రారంభం కానున్న కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పరుగులు తీయడం ఖాయమని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక, కడా కోసం నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా ఇది వరకు విధులు నిర్వర్తించిన వికాస్ మర్మట్‌ను కడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వ నియమించింది. 2019వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఆయన.. ఆధ్వర్యంలోనే పనులు సాగనున్నాయని అధికారులు చెబుతున్నారు. వందకోట్ల నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు చంద్రబాబు. ఆయా అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక అధికారులు రూపొందిస్తున్నారు. ఇక శాంతిపురం మండల పరిధిలోని కొలమడుగు గ్రామపంచాయతీ రామాపురం వద్ద కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరిశీలించారు. ఎయిర్‌పోర్టు సంబంధించిన భూ పరిశీలన వేగంగా సాగుతోంది. ఇక కుప్పంలోని చిగురుకుంట – బిస్సానత్తం గనుల నుంచి బంగారు నిక్షేపాలు వెలికి తీసేందుకు అడుగులు పడుతున్నట్లు సమాచారం.. దానిపై అధికారులు ఓ నివేదికను సిద్ధం చేస్తున్నారటా.. ఆ ప్రాజెక్టు వల్ల వేలమందికి కుప్పంలో ఉపాధి లభించే అవకాశం ఉంది. ఇలా కుప్పం అభివృద్ధి టార్గెట్ గా చంద్రబాబు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడమే కాకుండా ఆ పనులు వేగంగా సాగుతుండటంపై కుప్పం ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ సహా ఈ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు



దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాలకు కేంద్ర వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్రాల జాబితాను విడుదల చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రానున్న మూడు రోజులు అనేక రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. గోవా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే జూలై 16న (మంగళవారం) గుజరాత్‌లో అతి భారీ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నట్లు వెల్లడించింది. అలాగే వచ్చే మూడు రోజుల్లో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, నాగాలాండ్, కేరళ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇదిలా ఉంటే ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక కొండచరియలు విరిగిపడి పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇక శిబిరాల్లో లక్షలాది మంది ఆశ్రయం పొందుతున్నారు.

## తెలంగాణ పాఠశాలల్లో ప్రహరీ కమిటీలు..
## డ్రగ్స్ అరికట్టేందుకు నిర్ణయం



తెలంగాణ పాఠశాలల్లో ప్రహరీ కమిటీలు వేయనున్నారు. మాదక ద్రవ్యాల నిరోధానికి ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలు, విద్య, శిశు సంరక్షణ సంస్థల పరిసర ప్రాంతాలలో మాదకద్రవ్యాల విక్రయాలను ఆపడానికి ప్రహరీ కమిటీలు పనిచేయనున్నాయి. అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. పిల్లలను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుండి దూరం చేయడానికి ప్రహరీ క్లబ్ లు నిర్మించనున్నారు. పాఠశాలలు, విద్య, శిశు సంరక్షణ సంస్థల పరిసర ప్రాంతాలలో మాదకద్రవ్యాల విక్రయాలను ఆపడానికి ప్రహరీ క్లబ్ లు ఏర్పాటు చేయనున్నారు. పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధ మందులు, పదార్థాలు.. ఇతర రకాల వస్తువులు చేరకుండా నిరోధించడానికి ఈ క్లబ్ లు ఏర్పాటు చేయనుంది. త్వరలో విధివిధానాలు ఖరారు కానున్నాయి. డ్రగ్స్ కట్టడికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశించింది.

## నెల రోజుల్లో ఎన్డీయేకు మరో ఝలక్
## ఉపఎన్నికల్లో ఇండియా కూటమి స్వీప్..!




ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ సీట్లకు ఈ నెల 10న జరిగిన ఉపఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సాధారణ మెజార్టీని దూరం చేసి మిత్రపక్షాలపై ఆధారపడేలా చేసిన ఇండియా కూటమి.. తాజాగా జరిగిన ఉపఎన్నికల్లో మరోసారి దుమ్ము రేపింది. ఈసారి సార్వత్రిక ఎన్నికలను మించి సీట్లు సాధించి బీజేపీని, ఎన్డీయేను వెనక్కి నెట్టేసింది. ఎన్డీయే వర్సెస్ ఇండియా బ్లాక్ గా మారిన పోరులో అసాధారణ విజయాలు అందుకుంది. పశ్చిమ బెంగాల్‌లో నాలుగు, హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు, ఉత్తరాఖండ్‌లో రెండు, బీహార్, పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడులో ఒక్కొక్క సీట్లకు ఈ నెల 10న ఉపఎన్నికలు జరిగాయి. వీటి ఓట్ల లెక్కింపు ఇవాళ జరిగింది. ఫలితాల్లో బెంగాల్లోని రాయ్‌గంజ్, రణఘాట్ దక్షిణ్, బాగ్దా, మానిక్తలా అసెంబ్లీ సీట్లలో ఉపఎన్నికలను అధికార టీఎంసీ గెల్చుకుని క్లీన్ స్వీప్ చేసింది. అలాగే హిమాచల్ ప్రదేశ్ లోని మూడు సీట్లలో రెండు గెల్చుకోవడం ద్వారా అధికార కాంగ్రెస్ సత్తా చాటింది. ఇందులో సీఎం భార్య కమలేష్ ఠాకూర్ పోటీ చేసిన డెహ్రా సహా మరో సీటు కూడా ఉంది. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగలౌర్ లో కాంగ్రెస్ గెలుపొందింది. పంజాబ్ లోని జలంధర్ సీటును ఆప్ గెల్చుకుంది. తమిళనాడులోని విక్రవండీ సీటులో డీఎంకే ఘన విజయం సాధించింది. ఎన్డీయే కూటమిలో భాగమైన బీజేపీ మధ్యప్రదేశ్ లోని అమర్వారా సీటులో గెలిచింది. అలాగే హిమాచల్ ప్రదేశ్ లోని హమీర్ పూర్ సీటును బీజేపీ గెల్చుకుంది. మరోవైపు బీహార్ లోని రూపౌలీ సీటును జేడీయూ గెల్చుకుంది. దీంతో ఇండియా కూటమికి 10 సీట్లు, ఎన్డీయేకు 3 సీట్లు దక్కినట్లయింది.

# ప్రభుత్వ రంగంలోనే 'ఉక్కు'




స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రశ్నే లేదని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖామాత్యులు హెచ్‌డి కుమారస్వామి మీడియా సమావేశంలో పేర్కొనడం సంతోషకరమే! అయితే వెనువెంటనే ఆయన 'ప్రధాని అనుమతి లేకుండా ఈ విషయం నేను చెప్పలేను.. ఇక్కడి స్థితిగతులను ఆయనకు నివేదించి, ఈ కర్మాగారాన్ని ఎలా పునరుద్ధరించాలన్నది వివరించవలసి వుంద'ని అన్నారు. అంటే 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అని నినదించి 32 మంది యువ కిశోరాల ప్రాణ త్యాగంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా ఉండాలంటే ప్రధాని విస్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. దాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించాలి. ఇదీ జరగాల్సిన ప్రక్రియ. అదే రోజున విశాఖ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాగైనా ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకుంటాం అన్నారు కానీ ప్రైవేటుపరం కానివ్వం అని స్పష్టంగా పేర్కొనలేదు. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ప్రైవేటీకరణ ప్రయత్నాలు చేస్తే అప్పుడు దాన్ని నిలువరించి ఉక్కు ఫ్యాక్టరీకి మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించామని చంద్రబాబు చెబుతూ వచ్చారు. గురువారం కూడా ఆ విషయాన్ని గుర్తు చేశారు కానీ ఇప్పుడు 'ఉక్కు'ను కాపాడుకోవడం అన్నారు తప్ప ప్రైవేటు కానివ్వం అని లేదా ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూస్తాం అని స్పష్టంగా చెప్పకపోవడం సందేహాలకు తావిస్తుంది. వారి మద్దతుపైనే ఆధారపడిన ప్రభుత్వం కేంద్రంలో ఉన్న సమయంలో రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మకమైన విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించేలా సిఎం పట్టుబట్టలేరా విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రభుత్వ వాటాలు అమ్మేసి ప్రైవేటుకు అప్పగిస్తామని కేంద్ర ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ శాఖ (దీపమ్) కార్యదర్శి ప్రకటన వెలువడినప్పటి నుండి గడచిన మూడున్నరేళ్లకు పైగా ఉక్కు కార్మికులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. విశాఖ, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలతోబాటు యావత్ రాష్ట్రంలో ఆందోళనలు జరిగాయి. ఆ తరువాత కేంద్ర మంత్రులు ఎవరు మాటాడినా ప్రైవేటీకరణ తప్పదంటున్నారు కానీ ఆ పని చేయడానికి మాత్రం కేంద్రం సాహసించలేకపోయింది. ఇప్పుడు సాక్షాత్తూ ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి కార్మిక సంఘాల ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ 'విశాఖ స్టీల్‌ప్లాంటును పరిశీలించాను. దేశ ఆర్థిక అభివృద్ధికి ఈ ప్లాంట్ సహాయపడుతోందని దీనిపై ప్రధానికి వివరిస్తా.' అని తెలపడం శుభ పరిణామం. ప్లాంట్ మూతబడుతుందని ఎవరూ భయపడవద్దని కూడా ఆయనన్నారు. 'ఉక్కు' మూతబడుతుందన్న భయం ఎవరికీ లేదు. దాన్ని ప్రైవేటుపరం చేస్తారన్నదే అసలు భయం. అయితే, కుమారస్వామి స్థూలంగా భరోసా ప్రకటించినా స్టీల్‌ప్లాంట్‌కు కీలకమైన సొంత గనుల సంగతి ఏమిటి? లేక ముడి ఖనిజం ఎన్‌ఎండిసి నుండి సరఫరా చేస్తారా? మధ్యే మార్గంగా సెయిల్‌లో విలీనం చేస్తారా? వంటి విషయాలేమీ చెప్పనేలేదు. కనుక ప్రైవేటీకరణపై సందిగ్ధత కొనసాగుతున్నట్టే! అశేష త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కాకుండా కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. ఉక్కు కర్మాగారం, ఉద్యోగుల క్వార్టర్సు వున్న గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ లభించింది. కాబట్టి అధికార కూటమికి ఆ బాధ్యత మరింత పెరిగింది. అక్కడ గెలిచిన ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కూడా కావడం గమనార్హం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మూడున్నరేళ్లుగా పోరాడుతున్నారు. 'ఉక్కు'ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేంద్రంలో టిడిపి మద్దతుపైనే ఆధారపడి ఎన్‌డిఎ సర్కారు మనుగడ సాగుతున్నందున దానిపై ఒత్తిడి తెచ్చి ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరింపజేయడం తెలుగుదేశం పార్టీ విద్యుక్త ధర్మం. రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులైన చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని, ప్రధానిని ఒప్పించి లేదా ఒత్తిడి తెచ్చి, అవసరమైతే వివిధ రాజకీయ పార్టీల సహకారం తీసుకొని ఏవిధంగానైనా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలి. దాని మనుగడకు అవసరమైన సొంత గనులు, ముడి ఖనిజ లభ్యత, వర్కింగ్ క్యాపిటల్ తదితర సమస్యలనూ పరిష్కరించాలి. ఇది రాష్ట్ర ప్రజలందరి ఆకాంక్ష.

# మోడీ రష్యా పర్యటన-పశ్చిమ దేశాల అక్కసు !



ప్రధాని నరేంద్ర మోడీ సోమ, మంగళ వారాల రష్యా పర్యటన జయప్రదంగా ముగిసింది. రక్షణ ఒప్పందంతో సహా పూర్వపు సోవియట్ యూనియన్‌తో ఏర్పడిన బంధం అది విచ్ఛిన్నమైన తరువాత వారసురాలిగా వున్న రష్యాతో కూడా జయప్రదంగా కొనసాగుతున్నది. పాకిస్తాన్‌కు ఆధునిక ఆయుధాలు ఇచ్చి మన మీద ఉసికొల్పిన అమెరికాకు పోటీగా మనకు అవసరమైన మిలిటరీ సాయంతో పాటు అంతరిక్ష ప్రయోగాలలో కీలకమైన క్రయోజెనిక్ ఇంజన్ల పరిజ్ఞానంతో సహా అనేక రంగాలలో రెండు దేశాల అనుబంధం కొనసాగుతోంది. ఉక్కు, ఔషధ, ఇతర రంగాలలో మనం పొందిన సాయం కూడా తక్కువేమీ కాదు. ఇప్పటికీ మిలిటరీ ఆయుధాలు, పరికరాల అంశంలో రష్యాపైనే ప్రధానంగా ఆధార పడుతున్నాము. ప్రపంచ శ్రేణి క్షిపణి 'బ్రహ్మోస్' తయారీలో రష్యా భాగస్వామిగా ఉంది. ఎ.కె రకం మర తుపాకుల తయారీలో భాగస్వామ్యం వుంది. ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద గ్రంథమే అవుతుంది. ఇంతగా పెనవేసుకుపోయిన రెండు దేశాలనూ విడదీయాలని, తన ఆయుధాలను మనకు అంటగట్టాలని గడచిన మూడు దశాబ్దాలుగా అమెరికా చేయని పని లేదు. ఈ పూర్వ రంగంలో మోడీ పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పశ్చిమ దేశాల పాటలకు అనుగుణ్యంగా భారత్ నృత్యం చేసేందుకు సిద్ధంగా లేదన్న సందేశం పంపినట్లుగా చెప్పవచ్చు. దీని అర్థం వాటి నుంచి దూరంగా జరగటంగా భావించకూడదు. గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రను చూసినపుడు కొన్ని సందర్భాలలో ఏదో ఒక శిబిరం వైపు మొగ్గు చూపినట్లు కనిపించినా, ఆ మేరకు కొన్ని చర్యలున్నా భారత పాలక వర్గాలు అలీన విధానం పాటిస్తూ అటు సోషలిస్టు శిబిరం ఇటు పెట్టుబడిదారీ కూటమి నుంచి కూడా లబ్ధి పొందేందుకు చూడటం తెలిసిందే. ఉదాహరణకు చైనాకు వ్యతిరేకంగా అమెరికా మనలను తన వైపు లాగేందుకు చూస్తున్నది. దానిలో భాగంగానే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన కూటమి (క్వాడ్, చతుష్టయం)లో భారత్‌ను కూడా చేర్చుకున్నారు. అయితే 2020లో గాల్వన్ సరిహద్దు ఘర్షణ తరువాత కూడా చైనా నుంచి దిగుమతుల అంశంలో భారత్ గత రికార్డులతో పాటు నరేంద్ర మోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టారు. పెట్టుబడులను అడ్డుకొనేందుకు చూసినా తాజాగా విద్యుత్ వాహనాల రంగంలో చైనా పెట్టుబడులను కూడా అనుమతించేందుకు వైఖరిని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇది మన కార్పొరేట్ల ప్రయోజనాల కోసమని వేరే చెప్పనవసరం లేదు. ఇదే విధంగా ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థంగా ఉన్నప్పటికీ పశ్చిమ దేశాల ఆంక్షలు, బెదిరింపులను ఖాతరు చేయకుండా రష్యా నుంచి చౌక ధరలకు మన దేశం చమురు కొని పరోక్షంగా రష్యాను ఆర్థికంగా ఆదుకున్నది. దీన్ని పశ్చిమ దేశాలు మింగా కక్కలేకుండా ఉన్నాయి. మన కార్పొరేట్లు రష్యా చమురు ఉత్పత్తులను చౌకధరలకు ఐరోపా దేశాలకు విక్రయించి లబ్ధి పొందుతున్నాయి. అమెరికాతో వ్యూహాత్మకంగా, రష్యాతో రక్షణ భాగస్వామిగా సంబంధాలు కలిగిన ఏకైక దేశం ఏదైనా ఉంటే అది మన దేశమే. అంతర్జాతీయ రాజకీయాల్లో అటు అమెరికా, ఇటు రష్యా తమవైపు తిప్పుకొనేందుకు రెండూ ప్రయత్నిస్తున్నాయి. కొన్ని అంశాల్లో గత యుపిఏ, ప్రస్తుత మోడీ సర్కార్ అమెరికాతో అంటకాగేందుకు కొన్ని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ కొన్ని సందర్భాలలో దాని ఒత్తిడికి లొంగటం లేదు. ఉక్రెయిన్ సంక్షోభంలో తమ వైపుకు రానందుకు మన మీద అమెరికాకు పీకల దాకా కోపం ఉన్నప్పటికీ కొన్ని అంశాలలో తనకు అనుకూలంగా ఉన్నందున అది బయటపడకుండా తమాయించుకుంటున్నది. ఎక్కడ రష్యా వైపు మొగ్గుతామో అన్న భయంతో లేదా ఇతర కారణాలతో గానీ ఉక్రెయిన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల విషయంలో ఐరాస నిబంధనలకు భారత్ కట్టుబడి ఉండాలని మోడీ రష్యా పర్యటన సందర్భంగా అమెరికా బహిరంగంగానే వినతి పూర్వక హెచ్చరిక చేసింది. రష్యాతో సంబంధాలపై తమకున్న ఆందోళనలతో సహా అనేక అంశాలపై ఎలాంటి శషభిషలు లేకుండా భారత్‌తో చర్చించినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. రష్యాతో వ్యవహరించే ఏదేశానికైనా తాము ఇదే చెబుతామన్నాడు. నాటో కూటమి 75వ సమావేశాలు జరుగుతున్న తరుణంలో మూడవ సారి అధికారానికి వచ్చిన తరువాత నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. భారత్–రష్యా–చైనా సంబంధాలను దెబ్బ తీసేందుకు తంపులు పెట్టాలని, అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు చూస్తున్నాయనే అంశాన్ని గమనంలో ఉంచుకోవాలని, వాటి వలలో పడవద్దని చైనా హితవు పలికింది.

# అయినా.తీరు మారుతుందా



ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సేకరించటం, ప్రచురించటం, ప్రసారం చేయడం మీడియా బాధ్యత. ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛకు, గోప్యతకు భంగం వాటిల్లకుండా ఎక్కడ, ఏం జరుగుతుందో తెలుసు కోవడం ప్రజల హక్కు. పౌరులకు ఉన్న సమాచార హక్కును, దాన్ని నెరవేర్చేందుకు దోహదపడే మీడియా స్వేచ్ఛను తగిన విధంగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ, పాలక యంత్రాంగాలది. కానీ, అందుకు భిన్నంగా వ్యవహరించే ప్రభుత్వాల నుంచి, నిజాలను మాట్లాడితే సహించలేని పాలకుల నుంచి సహకారాన్ని కాక, పచ్చి నిరంకుశ ధోరణులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మోడీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి దేశంలో పత్రికా స్వేచ్ఛ మంటగలిసిందని అంతర్జాతీయ ప్రెస్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ) బుధవారం చేసిన వ్యాఖ్యలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కలానికి సంకెళ్లు వేస్తూ భావస్వేచ్ఛను నిర్వీర్యం చేస్తోంది. అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ మీడి యా మీద, పౌర సంస్థల మీద ఉక్కుపాదం మోపు తున్నది. జర్నలిస్టులపై దాడుల విషయంలో 12వ వరస్ట్ కంట్రీగా భారత్ నిలిచిందని ఇంప్యూనిటీ సూచీ-2023 గుర్తుచేసింది. పాత్రికేయులకు రక్షణ కల్పించ డంలో గత రెండు పాలనా కాలాల్లోనూ విఫలమైన మోడీ ప్రభుత్వం.. కనీసం ఈసారైనా పటిష్ట చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రాధాన్య తివ్వాలని ఐపీఐ కోరింది. జర్నలిస్టులపై దాడులు, హత్యల కేసుల్లో విచారణను సమగ్రంగా, విశ్వసనీయంగా, పారదర్శకంగా జరిపించాలని విజ్ఞప్తి చేసింది. ఒక సమాచారం ఇవ్వడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందా? లేక ఆ సమాచారాన్ని వెల్లడించే హక్కును నిషేధించటం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానాన్ని వివేకంతో, విచక్షణతో బేరీజు వేసిన తరువాతనే మీడియాపై చర్యలకు పూనుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం గతంలోనే వ్యాఖ్యానించింది. మీడియాపై కత్తి కట్టి, పత్రికాస్వేచ్ఛను కర్కశంగా అణచివేస్తున్న పాలకులు ఆ వ్యాఖ్యలనెప్పుడూ పట్టించుకున్న పాపాన పోలేదు. తమకు వ్యతిరేకంగా ఒక్క గొంతూ వినిపించకూడదను కోవడం, బలవంతాన నొక్కే యాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని 'ఐపీఐ' ఆందోళన వ్యక్తం చేసింది. హత్రాస్ ఘోరాన్ని కవర్ చేయటానికి వెళ్లబోతుంటే జర్నలిస్టు కప్పన్పై ఉపా కేసు బనాయించి రెండేళ్ల పాటు జైల్లో ఉంచిందీ ప్రభుత్వం. అన్నదాతల ఆందోళనకు మద్దతుగా మాట్లాడిందని సామాజిక కార్యకర్త దిశా రవిని తీవ్రంగా వేధించింది. రైతు ఉద్యమ వార్తలను రాసినందుకు న్యూస్క్లిక్ సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్త తదితరులపై దేశద్రోహ కేసులు బనాయించి, జైల్లో పెట్టింది. ప్రజల పక్షాన రాసిన, మాట్లాడిన అనేకమంది జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను వెంటాడి వేధించటం, దాడులు చేయించటం, తీవ్రమైన కేసులు మోపటం వంటి కక్షపూరిత చర్యలతో భయోత్పాతం సృష్టించటం ఒక విధానంగా కొనసాగిస్తోంది. మోడీ పాలనలో మీడియా స్వేచ్ఛ గణనీయంగా క్షీణించిందంటానికి ఇంతకంటే ఉదాహరణలు ఇంకేం కావాలి. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ చర్యలను ఏడాది క్రితమే సిఫార్సు చేసినప్పటికీ ఆ దిశగా పురోగతి శూన్యం అని ఐపీఐ విచారాన్ని వెలిబుచ్చింది. బీజేపీని విమర్శించే మీడియా సంస్థలు, జర్నలిస్టులను న్యాయ చిక్కుల్లో పడవేస్తున్నారు. జర్నలిస్టులను బెదిరించే పరంపర ఇలాగే కొనసాగితే ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ దెబ్బతింటుంది. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలించే విధంగా మీడియాను మోడీ ప్రభుత్వం లొంగదీసుకుంటోంది. సామాజిక, ఆర్థిక సమస్యలు, పేదరికం, నిరుద్యోగం, పిల్లల్లో పౌష్టికాహార లోపం, రైతాంగం వెతలు, ఆరోగ్యభద్రత, నాణ్యమైన విద్య తదితర సమస్యలు అత్యధిక మీడియాలో కనిపించడం లేదు. ఫ్యాషన్, పెరేడ్లు, క్రికెట్, సినిమాల వార్తలకే విశేష ప్రాధాన్యతనిస్తూ తమ ఉనికిని కాపాడుకుంటున్న పరిస్థితి నెలకొంది. దేశంలో మీడియా స్వేచ్ఛ ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాలి. అది యాజమాన్యాలకు స్వేచ్ఛగా కాకుండా.. అంతిమంగా సమాజానికి మేలు చేయాలని ఐపీఐ అభిప్రాయపడింది. భావప్రకటన, పత్రికాస్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కులు. వాటిని తొక్కిపెట్టాలనుకోవడం నియంతృత్వానికి దారితీస్తుంది. హిట్లర్ వంటి నియంతలు ఇలాంటి చర్యలకే పాల్పడి, చరిత్ర హీనులుగా మిగిలి పోయారు. కేంద్ర పాలకులు కూడా ఆ దిశగానే పరుగులు పెడుతున్నారు.

పత్రికా స్వేచ్ఛ ద్వారానే ప్రజాస్వామ్యం సమర్థంగా పనిచేయగలదని మోడీ ప్రభుత్వం తెలుసుకోవాలి. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి. ఇది కేవలం పత్రికలకు, పాత్రికేయులకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల భావాలకు అద్దం పట్టే పత్రికల స్వేచ్ఛ ప్రజలందరిదీ. దీనిని కాపాడుకోవటం మనందరి బాధ్యత.

## అయోధ్యనే కాదు.. బద్రీనాథ్ ను కూడా కోల్పోయిన బీజేపీ




ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అధికార బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బద్రీనాథ్ సీటు ను కోల్పోయింది. ఉత్తరాఖండ్‌లోని రెండు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఖాజీ మహ్మద్ నిజాముదీన్ 400 ఓట్ల స్వల్ప తేడాతో మంగ్రాల్ లో గెలుపును సొంతం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర భండారీని 5000 ఓట్ల తేడాతో ఓడించి.. బద్రీనాథ్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ నేత లఖపత్ సింగ్ బుటోలా దక్కించుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రణఘాట్ దక్షిణ్, బగ్దా నియోజకవర్గాల్లో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని దేహ్రా అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సఖు భార్య కమలేశ్ ఠాకూర్ ఘన విజయం సాధించారు. సమీప బీజేపీ అభ్యర్థి హొష్యార్ సింగ్‌పై 9 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి హొష్యార్ సింగ్ దాదాపు 4 వేల ఓట్ల మెజార్టీతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. ఆయన వరుసగా రెండుసార్లు ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు. జులై 10న ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఓ మోస్తరు నుండి.. అధిక శాతం ఓటింగ్ నమోదైంది. వివిధ పార్టీలకు చెందిన ప్రస్తుత ఎమ్మెల్యేల మరణాలు లేదా రాజీనామాల కారణంగా ఏర్పడిన ఖాళీల కారణంగా ఈ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి.

## ఫీజు రీయింబర్స్ మెంట్ పై సీఎం శుభవార్త..



హైదరాబాద్ జేఎన్టీయూలోని జేఎన్ ఆడిటోరియంలో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యపై ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్లోబల్ ఏఐ సమ్మిట్ హైదరాబాద్-2024 లోగోను సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మీరంత ఫీజు రీయింబర్స్?మెంట్ పై మా పాలసీ ఏంటని ఆలోచిస్తున్నారు.. కారు ఎంత పెద్దది ఐనా.. దాంట్లో ఇంధనం ఉంటేనే విలువ అని పేర్కొన్నారు. తెలంగాణా రాష్ట్రం సంక్షేమం మీదనే ఎక్కువ దృష్టి సారిస్తోంది.. అభివృద్ధి రెండో ప్రాధాన్యతగా మారిందని తెలిపారు. కొంత ఆర్థిక భారంతో రాష్ట్రం ఉందని అన్నారు. ఫీజు రీయింబర్స్?మెంట్ మొండిబకాయల కింద పడిందని సీఎం రేవంత్ తెలిపారు. మీరంతా ఆలోచించి వన్ టైం సెటిల్మెంట్ కి వస్తే బాగుంటుందన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క.. శ్రీధర్ బాబుకు అత్యంత సన్నిహితుడు అని చెప్పారు. వన్ టైం సెటిల్మెంట్ చేసే బాధ్యత శ్రీధర్ బాబుకు అప్పగిస్తున్నానన్నారు. ఈ ఏడాది నుంచి చేరే విద్యార్థులకు రెగ్యులర్ గా ఫీజు రీయింబర్స్మెంట్ ఉంటుందని తెలిపారు. ప్రతీ ఏటా ఇంజనీరింగ్ కాలేజీల నుంచి లక్ష మంది నిరుద్యోగులు బయటకు వస్తున్నారని సీఎం చెప్పారు. ఈ లోపం మీలో.. మాలో ఉందన్నారు. దాన్ని గుర్తించి సమస్యను పరిష్కరిద్దామని విద్యార్థులకు సూచించారు. ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగ యువతను ఉత్పత్తి చేసే కర్మాగారంగా కాకుండా ఉపాధిని కల్పించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సివిల్ ఇంజనీర్ల కొరత చాలా ఉంది.. కానీ కొన్ని కాలేజీలు సివిల్ ఇంజనీరింగ్ విభాగాన్ని ఎత్తేసే పనిలో ఉన్నారని పేర్కొన్నారు. సివిల్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్లను తప్పనిసరిగా తయారు చేయండని యాజమాన్యాలకు సూచించారు. లేదంటే భవిష్యత్తులో దేశం ఇబ్బందులకు గురవుతుందన్నారు. కరోనా వచ్చినప్పుడు వ్యాక్సిన్ తయారీకి ముందుకు వచ్చిన మూడు కంపెనీలు తెలంగాణలోనివేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## 'కేంద్ర సర్కార్ నిర్ణయంలో ఆశ్చర్యం లేదు'..
## రాజ్యాంగ హత్యాదినంపై ప్రియాంక గాంధీ



దిల్లీ: దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన జూన్ 25ను ఇకపై ఏటా 'రాజ్యాంగ హత్యాదినం' (సంవిధాన్ హత్యాదివస్)గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. మోదీ సర్కార్ తీసుకున్న చర్యలపై మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీ లేదని అని విమర్శలు గుప్పించారు. "దేశంలోని గొప్ప వ్యక్తులు కలిసికట్టుగా స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. కానీ, కేంద్రంలోని మోదీ సర్కార్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది. దాన్ని రద్దు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు 'సంవిధాన్ హత్యాదివస్' ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారు మాత్రమే పరిరక్షణ కోసం పోరాడుతున్నారు" అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారని.. కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారని ఎన్డీయే సర్కార్ గుర్తు చేసింది. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను 'సంవిధాన్ హత్యాదివస్'గా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇదంతా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న మరో కపట ప్రచార ఎత్తుగడ అని పేర్కొంది.

## కొనసాగుతున్న టీ.కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్



తెలంగాణలో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ కంటిన్యూ అవుతూనే ఉంది. బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. నిన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హస్తం పార్టీలో చేరగా...ఇవాళ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కూడా కాంగ్రెస్‌లో జాయిన్ అవుతున్నారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ టార్గెట్‌గా జాయినింగ్స్ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఫిరాయింపుల ప్రక్రియలో..ఎలాంటి టెక్నికల్ ప్రాబ్లమ్ రాకుండా కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోందనే చర్చ గాంధీభవన్ సర్కిల్స్‌లో జోరుగా జరుగుతోంది. అందులో భాగంగా.. నాడు బీఆర్ఎస్ అమలు చేసిన వ్యూహాన్నే కాంగ్రెస్ అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. మెజార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను జాయిన్ చేసుకుని..బీఆర్ఎస్ఎల్పీ విలీనమే లక్ష్యంగా హస్తం పార్టీ అడుగులు వేస్తున్నట్లు సమాచారం..

# జిల్లాల వారీ ఎస్సీ వర్గీకరణ.. ఆచరణ సాధ్యమేనా..




రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది. అంతకుముందు తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికలలో బీజేపీ ఎస్సీ వర్గీకరణ ప్రధాన అంశంగా ఎన్నికలకు వెళ్లడమే కాక, సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్‌లో జరిగిన ఒక సభలో దీనిపైన కార్యాచరణ ప్రకటించారు. ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు జిల్లాల వారీగా ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలను పంచుతామని ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అంటూ న్యాయస్థానాలు గతంలో ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో జిల్లాల వారి వర్గీకరణ ఏ మేరకు సాధ్యం అన్నదానిపై ఇప్పుడు అంతటా చర్చ జరుగుతున్నది. వాస్తవానికి షెడ్యూల్ క్యాస్ట్ (ఎస్సీ) అనేది ఒక కులం కాదు. అనాదిగా అణచివేతకు, దోపిడీకి, పీడనకు గురి కాబడుతున్న కొన్ని కులాల సమాహారం. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అత్యంత వెనుకబాటుతనానికి గురికాబడుతున్న 59 కులాలను రాజ్యాంగంలోని ఒక షెడ్యూల్‌లో చేర్చి, వారిని షెడ్యూల్ కులంగా వ్యవహరిస్తూ వారికి 15% రిజర్వేషన్ కల్పించడం జరిగింది. అయితే అణచివేయబడ్డ సమూహంలో కూడా అసమానతలు ఉన్నాయనీ, దీనిలో కొన్ని వర్గాలకే రిజర్వేషన్లు ఫలాలు దక్కుతున్నాయనీ, మాదిగ ఉప కులాలకు అన్యాయం జరుగుతున్నదనీ, కాబట్టి ఉన్న 15% రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరించి ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలను పంచాలంటూ ఒక వర్గం గత మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తుండగా, మరో వర్గం ఈ వాదనను వ్యతిరేకిస్తూ రాజ్యాంగం అమలులోనికి వచ్చిన నాటికి ఇప్పటికీ ఎస్సీల జనాభా గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఉన్న 15% రిజర్వేషన్ల శాతాన్ని జనాభా దామాషా ప్రకారం పెంచడం ద్వారా ఉపకులాలకు సైతం అవకాశాలు దక్కుతాయని వాదిస్తోంది. పైగా వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ఇది వైషమ్యాలకు దారితీస్తుందని, ప్రాంతీయ వ్యత్యాసమే తప్ప ఉప కులాలకు అన్యాయం ఏమీ జరగలేదని, మాదిగ ఉప కులాలు వృత్తులను నమ్ముకుని బతకడంతో ఉద్యోగాలపై దృష్టి పెట్టలేదని, కులవృత్తి లేని మాలలు విద్యా ఉద్యోగాలనే నమ్ముకున్నాయని, కాబట్టే వర్గీకరణ అనేది ఎస్సీల ఐక్యతను దెబ్బతీసేందుకు జరిగిన రాజకీయ కుట్రగా అభివర్ణిస్తూ ఆ వర్గం కోర్టులను ఆశ్రయించడంతో ఈ అంశం దశాబ్దాలుగా రాజకీయ అంశంగా రూపాంతరం చెందింది.

### మాదిగలను ప్రసన్నం చేసుకునేందుకు....

కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉషామహ్రా కమిషన్ తన నివేదికలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి సవరణ చేయాలని, దానిలో మూడవ క్లాజును చేర్చడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన పక్షంలో కులాల వర్గీకరణను పార్లమెంట్ ఆమోదించవచ్చు అని పేర్కొంది. రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని, దీనికై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో ఆ కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఎన్నికల సభల్లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేస్తే అందుకు తమ పార్టీ మద్దతు ఇస్తుందంటూ చెబుతూ వచ్చిన చంద్రబాబు, ఎన్నికల అనంతరం జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తామంటూ ప్రకటించారు. కేంద్రంలో బీజేపీ సంకీర్ణ పక్షాలు అరకొర ఆధిక్యంతో అధికారం చేపట్టడంతో, రాజ్యాంగ సవరణ సాధ్యం కాదని తేటతెల్లమైంది. రాజ్యాంగ సవరణ చేయాలంటే పార్లమెంటు ఉభయసభలలో మూడింట రెండు వంతుల మెజారిటీతో బిల్లు ఆమోదం పొందటంతో పాటు, సగానికి పైగా రాష్ట్రాల అసెంబ్లీలలో ఆమోదం కూడా అవసరం అవుతుంది. ఇప్పుడున్న పార్లమెంట్‌లో పార్టీల బలాబలాల నేపథ్యంలో ఇది సాధ్యం కాకపోవచ్చు. దీనితో ఎన్నికల్లో తమకు పూర్తిగా సహకరించిన మాదిగలను ప్రసన్నం చేసుకునేందుకు చంద్రబాబు జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇది ఎంతవరకు ఆచరణ సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా చేయకపోవడం వల్లనే న్యాయస్థానాల్లో సవాళ్లు ఎదురయ్యాయని, దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని వర్గీకరణ అంశంలో చిక్కుముడులను చంద్రబాబు ఎలా అధిగమిస్తారు, జిల్లాల వారీగా వర్గీకరణకు ఉన్న అవకాశాలు ఏమిటి అనే దానిపై చర్చ జరుగుతుంది.

### ప్రాంతాలవారీ వర్గీకరణలో చిక్కులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తులు కల్పిస్తున్న ఆర్టికల్ 371డి ద్వారా ఎస్సీ వర్గీకరణకు అవకాశాలు ఉంటాయని కొందరు మాదిగ కులానికి చెందిన మేధావులు కోరుతుండడంతో ఈ దిశగా చంద్రబాబు ఆలోచన చేస్తుండడం వల్లే జిల్లాల వారి వర్గీకరణ అంశాన్ని ఆయన ప్రస్తావించి ఉండవచ్చు అంటున్నారు. వాస్తవానికి ఆర్టికల్ 371డి ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాల రీత్యా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలకు సమాన అవకాశాలు, సౌకర్యాలు కల్పించవచ్చు. ప్రభుత్వ ఉపాధిలో. విద్యా విషయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వేరు వేరు కేటాయింపులు చేయవచ్చు. 1973 సంవత్సరంలో దేశంలోని కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక ప్రతిపత్తులు కల్పించేందుకు 32వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 371ని చొప్పించడం జరిగింది. అయితే ఈ ఆర్టికల్ ద్వారా ఎస్సీ వర్గీకరణ అమలులోనికి తేవడానికి ఎంతవరకు అవకాశం ఉంటుందనేది రాజ్యాంగ నిపుణులు ఆలోచించవలసిన విషయం.

### న్యాయస్థానాల్లో నిలబడుతుందా..

వాస్తవానికి ఈ ఆర్టికల్‌లో కులాలకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా లేదు. కేవలం ప్రాంతాలకు సంబంధించిన ప్రస్తావన మాత్రమే ఉన్నది. ఈ ఆర్టికల్‌ను అనుసరించి రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు చెందిన ప్రజల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో వారి ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఉద్దేశించబడిన రాజ్యాంగ ఏర్పాటుగా ఉన్నది. కానీ ఈ ఆర్టికల్ ద్వారా చేసే ఎస్సీ వర్గీకరణ న్యాయస్థానాల్లో ఎంతవరకు నిలబడుతుందనేది ప్రశ్నార్థకమే. మరోవైపు జిల్లాల వారి ఉప కులాల జనగణన కూడా ఒక ప్రతిబంధకంగా మారవచ్చు. ఏది ఏమైనా ఎస్సీ వర్గీకరణ అంశం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోమారు ప్రకంపనలు లేపనున్నదని భావించాలి.

# తెలంగాణ సినిమాను ప్రోత్సహించండి!

### గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారికి,




తెలంగాణా ఏర్పడిన గత పదేళ్లుగా అత్యంత నిరాదరణకు నిర్లక్ష్యానికి గురైన సాంస్కృతిక రంగం గురించి, సృజనాత్మకమైన రంగం గురించి కొన్ని సూచనలతో కూడిన విజ్ఞాపన ఇది. సహృదయంతో గమనిస్తారని, ప్రోత్సాహకరమైన నిర్ణయాలను తీసుకుంటారని ఆశిస్తాను. సాంస్కృతిక రంగంలో ముఖ్యంగా అత్యంత ప్రభావవంతం, జనాకర్షక రంగం అయిన సినిమా గురించి ఈ విజ్ఞాపన. సినిమా సర్వకళా సమ్మిళితమనీ, అది సమాజానికి అద్దం పడుతుందనే భావన దాదాపు అంతరించిపోయిన కాలమిది. సినిమా, వ్యాపారమా? పరిశ్రమా లేక రెంటి సమన్వయ రూపమా అన్నది ఇవాళ వెయ్యి డాలర్ల ప్రశ్న. అందుకే సినిమాను వ్యాపారం, పరిశ్రమ రెండూ కలగలిసిన హైబ్రిడ్ రూపమనే అనవచ్చునేమో.. అయితే కోట్లు పెట్టు.. కొల్లగొట్టు.. తగ్గేదే లే.. ఇది ఇవాల్టి సినిమా నినాదం. ఒక రకంగా తెలుగు సినిమాకు అది బజ్ వర్డ్. ఇవన్నీ అట్లా ఉంచితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ తర్వాత దృశ్య మాధ్యమం చేసిన సేవల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత అర్థవంతమైన సినిమా తెలంగాణ సినిమా లాంటి మాటలకు కూడా స్థానం లేని పరిస్థితిని చూసాం. హైదరాబాద్‌లో సినిమా రంగ ఎదుగుదలకు గాని లేదా యువతకు సినిమా రంగానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని అందించే ప్రయత్నాలు గానీ జరగలేదు. ప్రభుత్వ పరంగా ఆ దిశలో తీవ్రమైన నిరాదరణ నిర్లక్ష్యం కనిపించింది. నిజానికి ఎంతోమంది యువతీయువకులు సినిమా రంగంలో కాలు మోపేందుకు ఎంతో కష్టపడుతున్న సమయమిది. షార్ట్ ఫిలిమ్స్ తీస్తూ తమ ప్రతిభను బయట పెడుతున్నారు. కానీ గత ప్రభుత్వం చలనచిత్రాభివృద్ధి సంస్థకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకుంది. మరొక్క అడుగు కూడా వేయలేదు. ఈ సందర్భంగా మిమ్మల్ని చిన్న కోరికల్ని కోరుతున్నాను. 1985లో ఫిల్మ్ కౌన్సిల్ భావనను స్ఫూర్తిగా తీసుకుని బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం కోల్ కత్తాలో నందన్ సినిమా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసింది. అందులో పలు థియేటర్లు ఏర్పాటు చేసింది. కోల్‌కత్తా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్ని కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నది. తర్వాత 1998లో కేరళ రాష్ట్ర ప్రభుత్వం, 2009లో కర్ణాటక ప్రభుత్వం చలన చిత్ర అకాడెమీలను ఏర్పాటు చేశాయి. ఈ రెండు రాష్ట్రాలూ ప్రధాన స్రవంతి సినిమాకు సమాంతరంగా అర్థవంతమైన సినిమాకు ఇతోధికంగా ప్రోత్సాహమిస్తున్నాయి. కేరళ ఫిల్మ్ అకాడెమీ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణతో పాటు రాష్ట్రంలో పలు చోట్ల వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ మలయాళీ సినిమా ఎదుగుదలకు మలయాళీ సినీ కళాకారుల ప్రతిభ మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నది. కర్ణాటక చలనచిత్ర అకాడెమీ కూడా కన్నడ సినిమాకూ అంతర్జాతీయ సినిమాకు వారధిగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. అదే రీతిలో తెలంగాణ ప్రభుత్వం కూడా తెలంగాణ ఫిల్మ్ అకాడెమీ ఏర్పాటు చేస్తే యువతకు శిక్షణ ఇచ్చే పని జరుగుతుంది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న తెలంగాణ సినిమాకు ఎంతో ప్రోత్సాహంగా వుంటుంది. సినిమా రంగం పట్ల అభిమానంతోనూ ఆసక్తితోనూ వున్న యువతీ యువకులకు గొప్ప అవకాశాలు వచ్చే అవకాశం మెరుగుపడుతుంది. ఇంకా అకాడెమీ నేతృత్వంలో ఇన్‌స్టిట్యూట్, ఆర్కైవ్స్ లాంటివి ఏర్పాటైతే తెలంగాణ టాలెంట్‌కు కొత్త ఊపు వస్తుంది. అలాగే గతంలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు, బాలల కోసం ప్రత్యేక చిత్రోత్సవాలు జరిగేవి. అవన్నీ తెలంగాణ ఏర్పడిన తర్వాత అదృశ్యమైపోయాయి. వాటిని తిరిగి నిర్వహించడం వలన మంచి సినిమా సంస్కృతి ఇతోధిక ప్రోత్సాహం లభించి మన వాళ్ల దృష్టికోణం విస్తారమవుతుంది. అలాగే గతంలో మంచి సినిమాలకు ఇస్తూ వచ్చిన నంది అవార్డులను గత ప్రభుత్వం రద్దు చేసింది. దీనిని పునరుద్ధరించండి. కళాకారుల ప్రతిభను ప్రోత్సహించండి. అలాగే ఇవ్వాళ కేంద్రం ఆధ్వర్యంలో పూనా, కోల్‌కత్తాలలో మాత్రమే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లు పని చేస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేస్తే కొత్త తరానికి ఎంతో మేలు చేసిన వారు అవుతారు. ఇలాంటి కొన్ని అంశాల మీద దృష్టి పెట్టాలని సరైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.


# ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

### కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు కూడా..

### సమావేశంలో 15 అంశాలతో తీర్మానం

### రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

### 15 అంశాలతో బీజేపీ రాజకీయ తీర్మానం



హైదరాబాద్/రంగారెడ్డి అర్బన్,: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, ఫోన్ ట్యాపింగ్ కేసులను తక్షణమే సీబీఐకి అప్పగించాలని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యుత్తు కొనుగోలు అంశంలో జ్యుడీషియల్ కమిషన్ దర్యాప్తును వేగవంతం చేయాలని పేర్కొంది. రుణమాఫీ వెంటనే అమలు చేయాలంది. రైతుభరోసా కింద రైతులకు రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు 15 అంశాలతో రూపొందించిన రాజకీయ తీర్మానాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రవేశపెట్టగా, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్‌రావు బలపరిచారు. 'విద్యార్థి, యువ వికాసం గ్యారెంటీలను అమలు చేసి ప్రోత్సాహకం అందించాలి. శాంతి భద్రతలను కాపాడాలి. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలి. ధరణిని ప్రక్షాళన చేయాలి. ధాన్యం కొనుగోలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి. గొర్రెల స్కాంలో అవినీతిపరులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలి. ఇసుక, గ్రానైట్, డ్రగ్స్, లిక్కర్ మాఫియాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి. రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి. ఆయుష్మాన్ భారత్ అమలు చేయాలి. ఫీజు రీఇంబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలి' అని బీజేపీ తీర్మానంలో డిమాండ్ చేసింది.

### హామీలపై రేవంత్‌ది రోజుకో మాట: ఏలేటి

సీఎం రేవంత్ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా రోజుకో మాట చెబుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటుతున్నా రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. ధరణిని ప్రక్షాళన చేస్తామని, అక్రమాలపై విచారణ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. ఎందుకు జాప్యం చేస్తోందని నిలదీశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై చర్చించారు.